ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

శనివారం | 24-10- 2026 | సంపుటి: 17, సంచిక: 203, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

ఎల్‌నినోను సమర్థంగా

ఎదుర్కొందాం!

వచ్చే జూలై వరకు తాగునీటి కష్టాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కరువు ప్రభావాన్ని దాచిపెడితే క్యాన్సర్‌ను దాచినట్లే

పంటలు వేయకపోయినా ఉపాధి కల్పిస్తాం.. ప్రతి కుటుంబానికీ పని

విద్యుత్ పొదుపు పాటించాలి.. అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజాకలం): ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గి సాగు, తాగునీటి లభ్యత క్షీణించే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. వచ్చే జులై వరకు తాగునీటి ఇబ్బందులు కొనసాగే అవకాశముందని, ప్రజలు, అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరువు ప్రభావం ప్రారంభంలో పెద్దగా కనిపించకపోయినా.. క్రమంగా తీవ్రరూపం దాలుస్తుందని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించాలే తప్ప ఏదీ దాచిపెట్టవద్దని స్పష్టం చేశారు. ఎల్‌నినోపై ఆరు నెలలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇంగ్లాండ్, అమెరికా, మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల్లోనూ నీటి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో నీటి రేషన్ అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. రాష్ట్రంలోనూ తాగునీటి సమస్య తీవ్రం కాకుండా హైదరాబాద్‌తో పాటు పట్టణాలు, గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి, అందులో నమోదయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

సమస్యలప్పుడే నాయకుడి సామర్థ్యం

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. ప్రజలకు కచ్చితమైన సమాచారం అందించేందుకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును నోడల్ అధికారిగా నియమించామని చెప్పారు. ఎల్‌నినోపై ప్రతిరోజూ బులెటిన్ విడుదల చేయాలని, రామకృష్ణారావు రోజువారీ పరిస్థితులను వివరించాలని ఆదేశించారు.

తరువాయి 2వ పేజీలో...



కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
- కరవు ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు
- తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు..
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన
- అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలను చైతన్యపరచాలి
- రైతులకు అండగా ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి:
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజాకలం):

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది.

నియమిత గడువు అక్టోబర్ 31 తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్ నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిల పక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్-నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్-కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం

తరువాయి 2వ పేజీలో...

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాల్సిందే

సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం.. 27 నుంచి పాదయాత్ర - బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజా కలం): జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాల్సిందేనని బీజేపీ ఎంపీ ఈటలరాజేందర్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవరకు పోరాటంకొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 27 నుంచి పాదయాత్ర ప్రారంభిస్తామని వెల్లడించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ బాధితులతో శుక్రవారం నిర్వహించిన సమా వేశంలో ఈటల రాజేందర్, బీజేపీ శాసనస భాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. సమస్య కొలిక్కి వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని, ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

30 కి.మీ. పరిధిలో ఇబ్బందులు

డంపింగ్ యార్డ్ వల్ల జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోనే కాకుండా సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈటల రాజేందర్ అన్నారు. కీసర, ఘట్‌కేసర్, దమ్మాయిగూడ తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

కాంగ్రెస్‌ది లాంచింగ్.. ల్యాండింగ్ లేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా



హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజా కలం):

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కార్యక్రమాల పేరుతో కేవలం 'లాంచింగ్.. లాంచింగ్' చేస్తోందని.. వాటి అమలులో మాత్రం 'ల్యాండింగ్' కనిపించడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా ప్రతినిధులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని రైతులు, విద్యుత్, నీటి సమస్యలు, సింగరేణి, ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ తదితర అంశాలపై మాట్లాడారు.

రైతులు అల్లాడుతుంటే ఢిల్లీ పర్యటనలా?

రాష్ట్రంలో రైతులు నీరు, విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లడం బాధ్యతారాహిత్యమని రామచందర్‌రావు విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో పలు ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తుందన్నారు. హైదరాబాద్‌లోనూ నీటి సమస్యలు తీవ్రతరమయ్యాయని, ట్యాంకర్లకు బుకింగ్‌లు పెరిగిపోయాయని చెప్పారు. విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సమస్యలను సహజ విపత్తుగా చూపిస్తూ ప్రభుత్వం చేతులెత్తేయడం సరికాదన్నారు. రైతులను పరామర్శించేందుకు వెళ్లిన వారిని అరెస్టు చేయడం అమానుషమని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ ప్రజాప్రతినిధి కూడా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించలేదని ఆరోపించారు.

తరువాయి 2వ పేజీలో...

ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలి

జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉపాధి పనుల విస్తరణకు చర్యలు తీసుకోవాలి

3

వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం త్వరలో ఏర్పాటు



- కార్మికుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం
- పరిశ్రమల అభివృద్ధి-కార్మికుల సంక్షేమం రెండూ ముఖ్యం
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

హైదరాబాద్, అక్టోబరు 23 (ప్రజాకలం):

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో "సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్: రీబిల్డింగ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ సోషల్ డైలాగ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, భవిష్యత్తులో పని విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మిక రంగాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. దేశంలోని సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సంఘటిత రంగ కార్మికులకు ట్రేడ్ యూనియన్ల ద్వారా తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం పోరాడే అవకాశం ఉందని, అసంఘటిత రంగ కార్మికులకు ఆ స్థాయిలో ప్రాతినిధ్యం, రక్షణ లేదని అన్నారు. ఈ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్చలు, విధానపరమైన చర్యలు అవసరమన్నారు.

తన తండ్రి గడ్డం వెంకటస్వామి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టే సమయంలో పారిశ్రామిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చినా, కార్మికుల ప్రయోజనాల కోసం ఆయన అండగా నిలిచారని తెలిపారు.

గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ చేపట్టిన చొరవను మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ చొరవతోనే తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకొచ్చామని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామన్నారు. హమాలీ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరు సంక్షేమ బోర్డుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...

విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం..
మానవ మనుగడకే ముప్పు
ప్రజా కలం ప్రత్యేకం...

- మోగనున్న ప్రమాదగంటికలు
- నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్న ప్రభుత్వం
- ప్లాస్టిక్ వాడకంతో పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారి
- ప్రభుత్వం ఇప్పటికైనా పటిష్టమైన నివారణ చర్యలు చేపట్టాలి

హైద్రాబాద్ అక్టోబర్ 23
(ప్రజాకలం ప్రతినిధి)

ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్లాస్టిక్ మన జీవితంలో ఒక భాగమైపోయింది. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు ప్రతి వస్తువులోనూ ప్లాస్టిక్ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దర్శనమిస్తోంది.ఈ విచ్చలవిడి ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి తీవ్రమైన ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

పర్యావరణానికి పొంచివున్న ప్రమాదం

ప్లాస్టిక్ భూమిలో కరిగిపోవడానికి వందల సంవత్సరాలు పడుతుంది. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమవడమే కాకుండా, భూమి యొక్క సారవంతం దెబ్బతింటుంది. నదులు,కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోవడం వల్ల వరదలు ముంచెత్తుతున్నాయి. అలాగే సముద్రాల్లో ప్లాస్టిక్ చేరడం వల్ల వేలాది జలచరాలు ప్రాణాలు కోల్పోతున్నాయి.


పెరిగిపోతున్న క్యాన్సర్ మహమ్మారి

ప్లాస్టిక్ వాడకం కేవలం పర్యావరణానికే కాదు, నేరుగా మానవ ఆరోగ్యానికే చేటు తెస్తోంది.ప్లాస్టిక్ బాటిళ్లు,కవర్లలో వేడి పదార్థాలు లేదా నీటిని నిల్వ ఉంచినప్పుడు, వాటి నుంచి 'మైక్రోప్లాస్టిక్స్' ప్రమాదకరమైన రసాయనాలు ఆహారంలోకి చేరుతాయి.ఇవి శరీరంలోకి ప్రవేశించడం వల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడటమే కాకుండా,



తరువాయి 2వ పేజీలో...

కలం కౌంటర్



విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం..
మానవ మనుగడకే ముప్పు

మొదటి పేజీ తరువాయి...

క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి.

ప్రభుత్వం నివారణ చర్యలు

ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టడంలో విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం చట్టాలు,నిషేధాలు కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పటిష్టమైన చట్టాలు... సింగిల్ యూజ్ ఒక్కసారి మాత్రమే వాడే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించాలి.

ప్రత్యామ్నాయాలు... ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జనపనార సంచులు,బట్ట సంచులు, కాగితపు ప్యాకింగ్‌లను ప్రభుత్వం ప్రోత్సహించాలి.

వృక్షాలు – పర్యావరణ రక్షణ

పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి పెద్ద ఎత్తున మొక్కలు నాటడం వృక్ష సంరక్షణ అడవులను పెంచడం వంటి చర్యలు వేగవంతం చేయాలి.ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజలు మేల్కొనకపోతే రాబోయే కాలంలో మానవ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. "ప్లాస్టిక్‌ను విడనాడదాం – పర్యావరణాన్ని కాపాడుకుందాం'' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలి.

కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు
ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి...

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ నినో , కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి సబ్–కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సివిస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, అర్హత కలిగిన మండలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. కరువు, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దటి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటిపారు దల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి
ప్రత్యేక బోర్డులు

మొదటి పేజీ తరువాయి...

గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

తెలంగాణలో గత పదేళ్లుగా కనీస వేతనాలను ప్రకటించలేదని, తాను కార్మిక శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత కనీస వేతనాలను ప్రకటించామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

కార్మికులకు తగిన వేతనాలు, గౌరవప్రదమైన జీవనం అందినప్పుడే ఉత్పాదకత పెరుగుతుందని, పరిశ్రమల్లో పారిశ్రామిక శాంతి నెలకొంటుందని వివరించారు. పరిశ్రమలు, కార్మికులు పరస్పర సహకారంతో ముందుకు సాగినప్పుడే పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని మంత్రి అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఫ్యాక్టరీల తనిఖీల సందర్భంగా అధికారులు సూచించిన భద్రతా చర్యలను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు.

తనిఖీ నివేదికలను కంపెనీల బోర్డు సమావేశాల్లో చర్చించి, భద్రతా లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతలను గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనకు నైపుణ్యాభివృద్ధి కీలకమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఊజం) అభివృద్ధి చేస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ. 2,000 స్టైపెండ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విదేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జర్మనీలో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు అవకాశాలు ఉన్నాయని, అక్కడి సంస్థలతో చర్చల సందర్భంగా సుమారు 5 లక్షల ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావన వచ్చిందని చెప్పారు. తన నియోజకవర్గంలోని మందమర్రిలో 70 మంది యువతకు జర్మన్ భాషలో శిక్షణ అందిస్తున్నామని, వారికి తన సంస్థ తరపున స్టైపెండ్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు జర్మనీలో ఉపాధి కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. యూరప్, జపాన్ తదితర దేశాల్లో మారుతున్న ఉపాధి అవకాశాలకు అనుగుణంగా స్థానిక భాషలు, ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ పొందడం అవసరమన్నారు. విధాన నిర్ణయాల్లో కార్మికులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. బలమైన ట్రేడ్ యూనియన్లు, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, అర్థవంతమైన సామాజిక సంభాషణ ద్వారా న్యాయబద్ధమైన, సమ్మిళిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు.

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం!

మొదటి పేజీ తరువాయి...

గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడే నాయకుడి సామర్థ్యం బయటపడుతుందని, ఈ పరిస్థితుల్లో భట్టి విక్రమార్క చేస్తున్న కృషిని అభినందిస్తున్నానని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని తెలిపారు. ఈ సమస్యను దాచిపెట్టడం క్యాన్సర్‌ను దాచిపెట్టడంతో సమానమని వ్యాఖ్యానించారు.

వానాకాలం పంటకు నీరిస్తాం

రాష్ట్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలోనూ లేనంత విద్యుత్ డిమాండ్ ప్రస్తుతం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ అప్పులు తెచ్చి, అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తూ సరఫరా చేస్తున్నామని చెప్పారు. యూనిట్‌కు రూ. 15 చెల్లించినా విద్యుత్ లభించే పరిస్థితి లేదని అన్నారు. విద్యుత్ వినియోగదారులు సాధ్యమైనంత మేరకు స్వీయ నియంత్రణ పాటించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విద్యుత్ పొదుపు చర్యలు అమలు చేయాలని సూచించారు. వానాకాలం పంటకు ఎంత కష్టమైనా నీరు అందిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. అయితే భూగర్భ జలాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో పంటలు వేస్తే రైతులు పెట్టుబడులు నష్టపోయే ప్రమాదముందని హెచ్చరించారు. నీరు, విద్యుత్ అందుబాటులో ఉన్నాయని పంటలు సాగు చేస్తే సరిపోదని, వాస్తవ పరిస్థితులను అంచనా వేసుకోవాలని సూచించారు. హరీశ్‌రావు మాటలు విని నీటి లభ్యతను పట్టించుకోకుండా పంటలు వేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని వ్యాఖ్యానించారు. రైతులకు పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికల్లో వారానికోసారి సమావేశాలు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అభినందించారు. పశు సంపదను కాపాడుకునేందుకు అవసరమైన పశు గ్రాసం, నీటి వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

ఉపాధి హామీతో ప్రతి చేతికీ పని

భూమిలేని పేదలు, వ్యవసాయ కూలీలకు ప్రతిరోజూ పని దొరకాలని, ప్రతి కుటుంబం కడుపునిండా తినాలనే లక్ష్యంతో సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం పథకానికి ఏ పేరు పెట్టినా, పేరు మార్చినా దాని ప్రాథమిక లక్ష్యం ఉపాధి కల్పనేనని అన్నారు. సంక్రాంతి నుంచి మే నెల వరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో పర్యటించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్నారా లేదా పర్యవేక్షించే బాధ్యతను తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అందుబాటులో లేని ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అప్పగించారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పొలాలకు వెళ్లే రహదారులు నిర్మించాలని, చెరువులు, కుంటలు, కాలువలను బాగు చేయాలని సూచించారు. ప్రతి చేతికీ పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పంటలు వేయకపోయినా కూలీలకు ఉపాధి కల్పిస్తామని, ప్రతి కుటుంబానికి పని దొరికేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

యాదాద్రి ప్లాంట్‌పై విమర్శలు

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంపై గత ప్రభుత్వాన్ని సీఎం తీవ్రంగా విమర్శించారు. బొగ్గు అందుబాటులో లేని దామరచర్లలో ప్లాంట్ నిర్మించడం వల్ల ఏటా బొగ్గు రవాణాకు రూ. 2,000 కోట్ల భారం పడుతోందని ఆరోపించారు. నాలుగేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టును పదేళ్లయినా పూర్తి చేయలేకపోయారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొని పూర్తి చేసిందని చెప్పారు. సింగరేణి, కోల్ ఇండియా, నైనీ గనుల్లోనూ జీ–9 రకం బొగ్గు అందుబాటులో లేదని, ప్రస్తుతం జీ–12, జీ–13 రకం బొగ్గుతో యాదాద్రి ప్లాంట్‌ను నడుపుతున్నామని తెలిపారు.

విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితిని సృష్టించి, ప్రాజెక్టు పేరుతో భారీగా ప్రజాధనాన్ని ఖర్చు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం చెప్పిన 'నీళ్లు, నిధులు, నియామకాలు' నినాదం ప్రజల ప్రయోజనాల కంటే ఒక కుటుంబానికే ఉపయోగపడిందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి నిల్వలు, బొగ్గు కొరత ఉన్నప్పటికీ విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నామని, ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలను ప్రజలకు వివరించడంలో వెనుకబడుతున్నామని అన్నారు.

సోలార్ విద్యుత్‌తో అదనపు ఆదాయం

విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో ప్రతి ఇంటికీ సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. దీనివల్ల ఇంటి విద్యుత్ అవసరాలు తీరడంతో పాటు మిగులు విద్యుత్‌ను విక్రయించి నెలకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు ఆదాయం పొందుతున్నారని వివరించారు.

వడదెబ్బ నుంచి ప్రజలను కాపాడాలి

ఎండ తీవ్రత పెరిగే నేపథ్యంలో వడదెబ్బ కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి, నీరు, విద్యుత్ వినియోగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కరోనా సమయంలో హెచ్చరికలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం పేర్కొన్నారు. అప్పట్లో మాస్కుల అవసరాన్ని తక్కువ చేసి చూపడం, ప్రజల ఆందోళనలను హేళన చేయడం సరికాదని విమర్శించారు. కరోనా సమయంలో ఆసుపత్రులు, శ్మశానాల్లోనూ స్థలాలు సరిపోని పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని రాజకీయ విమర్శలకే పరిమితం చేయకుండా, ప్రజల జీవనోపాధి, తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, పశుసంపద పరిరక్షణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ముందస్తు ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, సమన్వయంతో కరువు పరిస్థితులను ఎదుర్కోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాల్సిందే

మొదటి పేజీ తరువాయి...

లీచర్డ్ నీరు చెరువుల్లోకి చేరడం వల్ల చేపలు చనిపోతున్నాయని, ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు గర్భస్రావాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతుంటే బాధ కలుగుతోందన్నారు. క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు వంటి అనారోగ్యాలు వస్తున్నాయని ఆరోపించారు.

మీథేన్ కాలుష్యంపై ఆందోళన

ప్రపంచంలో మీథేన్ కాలుష్యాన్ని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న కేంద్రాల్లో జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నాలుగో స్థానంలో ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఇక్కడి నుంచి భారీగా మీథేన్ వాయువు విడుదలవుతోందని, దాని ప్రభావం హైదరాబాద్ వాతావరణంపైనా పడుతోందని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో చెత్త నిర్వహణ సరిగా లేకపోతే జవహర్‌నగర్ ప్రాంతమే కాకుండా హైదరాబాద్ నగరానికీ ముంపు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. చెత్తను శాస్త్రీయంగా నిర్వహించడంతో పాటు దుర్వాసన, లీచర్డ్ నీటి సమస్య లేకుండా చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎక్కడ ఉన్నా తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

'రేవంత్.. ఇక్కడి ప్రజలను పట్టించుకోలేదు'

'ప్రశ్నించే గొంతుక' అని చెప్పి రేవంత్‌రెడ్డికి ఓటు వేసి ఎంపీగా గెలిపిస్తే.. ఆయన ఈ ప్రాంతం వైపు తొంగి కూడా చూడలేదని ఈటల విమర్శించారు. తాను ముఖ్యమంత్రిని కలిసి జవహర్‌నగర్ సమస్యను పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోయిందన్నారు. "డంపింగ్ యార్డ్ సమస్యపై రాజకీయ భేషజాలకు పోకుండా ముఖ్యమంత్రిని కలిశాను. అయినా ప్రయోజనం లేదు. సమస్య పరిష్కారానికి సియోల్ వెళ్లాల్సిన అవసరం లేదు. ఐఏఎస్ అధికారి నరహరి సూచించిన పరిష్కారాలను ఇక్కడే అమలు చేయాలి" అని అన్నారు.

'హైదరాబాద్ బ్రాండ్‌ను దెబ్బతీయొద్దు'

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయకుండా డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపాలని ఈటల కోరారు. "డబ్బుల కోసం ఆలోచించకుండా.. దుర్వాసన, లీచర్డ్ వాటర్ లేకుండా చేసే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. మీకు చేతకాకపోతే చెప్పండి.. కేంద్ర ప్రభుత్వంతో చేయిస్తాం" అని అన్నారు. కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణకు రెండు లక్షల ఇళ్లను తీసుకొచ్చామని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం కేంద్రం నిధులు అందిస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ మాత్రం 'నేను ప్రజల సేవకుడిని' అని చెబుతారే తప్ప.. కేంద్రం ఇచ్చినవాటిని రాజకీయంగా ప్రచారం చేసుకోరని పేర్కొన్నారు.

హైడ్రాపైనా విమర్శలు

హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసి వారిని ఇబ్బందులకు గురిచేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. బుల్డోజర్లతో ఇళ్ల సామాన్లను తొక్కించారని విమర్శించారు. బీజేపీ చేసిన పోరాటాల ఫలితంగానే హైడ్రా చర్యలకు అడ్డుకట్ట పడిందన్నారు. మూసీలో కొబ్బరినీళ్లలాంటి స్వచ్ఛమైన నీరు పారిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే దాని కోసం ఇళ్లను కూల్చివేయడం మాత్రం సరికాదన్నారు. బాధితులకు అండగా నిలిచి ఇళ్ల కూల్చివేతలను అడ్డుకున్నామని చెప్పారు.

ఐక్య పోరాటం చేస్తాం

తెలంగాణ ఉద్యమానికి పోరాట చరిత్ర ఉందని, అలాంటి నేల నుంచి తాను వచ్చానని ఈటల పేర్కొన్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారని తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ కలిసి వస్తారని, ఐక్యంగా పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే జవహర్‌నగర్‌లో 'సకల జనుల సమ్మె' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ఎస్.మల్లారెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవినాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది లాంచింగ్.. ల్యాండింగ్ లేదు

మొదటి పేజీ తరువాయి...

అఖిలపక్ష భేటీ నిర్వహించాలి

రాష్ట్ర సమస్యలపై ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని రద్దు చేయకుండా అన్ని పార్టీలతో చర్చించి సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిందని రామచందర్‌రావు అన్నారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. విద్యుత్ కొరతను అధిగమించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ సరఫరా, సౌర విద్యుత్, బొగ్గు లభ్యత వంటి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు. బొగ్గు కొరత ఎదుర్కొన్న మరో రాష్ట్రానికి కేంద్రం సహాయం చేసిందని గుర్తుచేశారు. బొగ్గు సరఫరాపై రాజకీయ ఆరోపణలు చేయడం కంటే ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు.

సింగరేణి నిర్వహణ రాష్ట్రానిదే

సింగరేణిలో కేంద్రానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ నిర్వహణాధికారాలు రాష్ట్ర ప్రభుత్వానివేనని రామచందర్‌రావు స్పష్టం చేశారు. సంస్థ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, లాభనష్టాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్రం రెండు బొగ్గు బ్లాకులను వేలం లేకుండా కేటాయించి సింగరేణిని ఆదుకుందని చెప్పారు. గత ప్రభుత్వాలు బొగ్గు బ్లాకుల వేలం విధానాన్ని దుర్వినియోగం చేశాయని ఆరోపించారు.

నష్టాలపై అధికారిక నివేదికలు పంపాలి

ఎల్‌నినో ప్రభావం, పంట నష్టాల నేపథ్యంలో కేంద్ర సహాయం కోరితే పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని అన్నారు. అయితే నష్టాలను కలెక్టర్ల స్థాయిలో అధికారికంగా అంచనా వేసి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నివేదికలు పంపాల్సి ఉంటుందని చెప్పారు. నష్టపరిహారం కోరే ముందు నిర్దేశిత ప్రక్రియను ప్రభుత్వం పాటించాలని సూచించారు.

ఓటర్ల జాబితాపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

ఓటర్ల జాబితా, ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ అనవసర గందరగోళం సృష్టిస్తోందని రామచందర్‌రావు విమర్శించారు. ఓట్ల తొలగింపుపై ఫిర్యాదులకు నిర్దిష్ట ప్రక్రియ ఉందని, ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. నిజమైన కేసులు ఉంటే వివరాలను బయటపెట్టాలని అన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టుపై కుమ్మక్కు ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. పశ్చిమబెంగాల్‌లో సాఫ్ట్‌వేర్‌పై ఆరోపణలు చేయడం కూడా సరికాదని పేర్కొన్నారు.

'లోక్‌తంత్ర్ బచావ్.. అరాజకతా హటావ్'

కాంగ్రెస్ ప్రచారానికి కౌంటర్‌గా 'లోక్‌తంత్ర్ బచావ్.. అరాజకతా హటావ్' నినాదంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామచందర్‌రావు తెలిపారు. నవంబరు 1న హైదరాబాద్‌లో ప్రజల భాగస్వామ్యంతో పాదయాత్ర చేపడతామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, సిద్దిపేట సహా ఐదు కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహిస్తామని వెల్లడించారు.

వీధి నిరసనలతో రాజ్య మార్పు సాధ్యం కాదు

బికనీర్ హౌస్‌లో జరిగిన చర్యలు నిబంధనల ప్రకారమే జరిగాయని రామచందర్‌రావు అన్నారు. అనుమతి లేకుండా నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించడం సరికాదన్నారు. చట్టబద్ధంగా, బాధ్యతాయుతంగా నిరసనలు తెలపాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారానే జరగాలని.. వీధి నిరసనలతో 'రాజ్య మార్పు' సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ విమర్శలు చేస్తూ వెళ్లొచ్చని, అయితే ప్రజలు తమ తీర్పును ఇప్పటికే ఇచ్చారని రామచందర్‌రావు అన్నారు.

దేశ అంతర్గత శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు
విదేశీ దుష్టశక్తుల యత్నాలను తిప్పికొట్టాలి - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

మల్లాపూర్ (ప్రజా కలం): భారతదేశ అభివృద్ధిని ఓర్వలేక దేశ అంతర్గత శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు విదేశీ దుష్టశక్తులు నిరంతరం కుట్రలు పన్నుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇలాంటి యత్నాలను తిప్పికొట్టేందుకు దైవానుగ్రహంతోపాటు ప్రజల ఐక్యత ఎల్లప్పుడూ తోడుండాలని ఆకాంక్షించారు.బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు గీతామూర్తి కుటుంబం ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో నిర్వహించిన 'దేశ రక్షణ–ధర్మ రక్షణ' చండీ హోమయాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు.అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ.. గురు, చంద్ర గ్రహాలతోపాటు సర్వదేవతల అనుగ్రహంతో దేశం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజ వికాసానికి ధర్మ రక్షణే మూలస్తంభమని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, సమర్థవంతమైన నాయకత్వంతో దేశాన్ని నిరంతరం ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. పవిత్రమైన ఈ యాగాన్ని సంకల్పించిన గీతామూర్తి కుటుంబంతోపాటు యావత్ భారత ప్రజానీకానికి సకల దేవతల ఆశీస్సులు లభించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బెల్లంపెల్లి లో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



బెల్లంపల్లి, అక్టోబర్ 23, (ప్రజాకలం) ప్రతినిధి..

ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సిఐటియు,వ్యవసాయ కార్మిక ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.నాయకులు దుంపల రంజిత్,అశోక్ గుమాస మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు నీ ఎస్ఐఆర్ ద్వారా చాలా మంది కోల్పోయారు అని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు,రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క కోటి,మంచిర్యాల జిల్లా లో 20వేల మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఓటు హక్కు కోల్పోయిన అర్హులందరికీ ఓటు హక్కును కల్పించి జ్ఞానేశ్ కుమార్ నీ విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ రావు 19 వ వర్ధంతి



వెల్గటూర్, సెప్టెంబర్ 23,ప్రజాకలం: వెల్గటూర్ మాజీ సింగిల్ విండో చైర్మెన్, వెల్గటూర్ మాజీ సర్పంచ్ శ్రీలత భర్త కల్వకుంట్ల రమేష్ రావు 19 వ వర్ధంతిని ఆయన అభిమానులు, నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెల్గటూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్ర పటం ఆవిష్కరించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత మాట్లాడుతూ రమేష్ రావు అందరి ఆదరాభిమానాలు పొందుతూ వెల్గటూర్ అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేశారని అన్నారు. వెల్గటూర్ గ్రామస్తుల మనస్సులల్లో ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. రమేష్ రావు వంటి నాయకులు అరుదురా ఉంటారని, ఆయన గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో ఘనంగా అలయ్ బలయ్

- హిందూ సంస్కృతి రక్షణకే అలయ్ బలయ్
- బిజెపి రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజి



బెల్లంపల్లి, అక్టోబర్ 23, (ప్రజాకలం) ప్రతినిధి : హిందూ సంస్కృతి రక్షణకే శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని అగర్వాల్ భవన్ లో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించామని బిజెపి రాష్ట్ర నేత ,కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కొయ్యల ఏమాజి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బెల్లంపల్లి పట్టణంలో మొదటి సారి ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బిజెపి సీనియర్ నేత, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాలు, కులాలు, మతాలు, పార్టీలు, సంఘాలను కలుపుకొని అలయ్ బలయ్ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు కండువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బొల్లెడ్ల కేశవరెడ్డి, ఎఫ్ సి ఐ సభ్యులు పులగం తిరుపతి,తాండూరు మండల అధ్యక్షుడు భరత్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్,ఓ బి సి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామయ్య యాదవ్, గోవర్ధన్,జిల్లా కార్యదర్శి ఆకుల శంకర్,ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింగ్,కల్లేపల్లి నవీన్, యుగంధర్,గణేష్, రాజ్కుమార్,రాములు, స్వామి,రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కోటిలింగాల ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ...

వెల్గటూర్, సెప్టెంబర్ 23, ప్రజాకలం, ప్రతినిధి : జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని, కోటిలింగాలలో గల కోటేశ్వర స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న కోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల సమయం వరకు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. శాతవాహనుల చరిత్ర కలిగి, ఎంతో ప్రాచుర్యం పొందినటువంటి కోటేశ్వర స్వామి ఆలయాన్ని తొందరలోనే పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతరెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్, డైరెక్టర్లు గుమ్ముల వెంకటేష్, రాపాక రాయకోటి, ఆలయ అర్చకులు సంజీవ్ శర్మ నాగరాజ్ శర్మలు పాల్గొన్నారు.



అన్నదాతను నిండా ముంచిన బయో మందులు

న్యాయం చేయండి.. లేదంటే ఆత్మహత్యే గతి - ప్రెస్‌క్లబ్ వేదికగా అన్నదాత రాజయ్య ఆక్రందన



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

బయో పురుగుమందుల పిచికారీ వికటించి చేతికొచ్చిన వత్తి వంట నమూలంగా నాశనమైందని,వ్యవసాయ అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యమని పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు కుంటూరి రాజయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన,తన 2 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో సుమారు రూ.2.50 లక్షల మేర అప్పులు చేసి పత్తి సాగు చేయగా, వంటలో దోమ నివారణ కోసం జూలపల్లిలోని శ్రీ రామాంజనేయ పెస్టిసైడ్స్ దుకాణంలో అక్టోబర్ 4న కొనుగోలు చేసిన ఎస్కే రెడ్డి కంపెనీకి చెందిన ప్రెసిడెంట్,వజ్రం బయో మందులను కొనుగోలు చేసి, దుకాణదారు సూచనల మేరకు కలిపి పిచికారీ చేయడంతో చేను మొత్తం ఎర్రబారి మాడిపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు.దాదాపు రూ.4 లక్షల వరకు దిగుబడి ఆశించిన తనకు అపార నష్టం వాటిల్లిందని,ఈ విషయమై ప్రశ్నిస్తే అటు డీలర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కంపెనీ ప్రతినిధులు మొదట న్యాయం చేస్తామని చెప్పి ప్రస్తుతం ఫోన్లు కూడా ఎత్తడం లేదని వాపోయారు.ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశానని రైతు తెలిపారు.అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని నమోదు చేయాలని,సదరు బయో పెస్టిసైడ్స్ నాణ్యత,బ్యాచ్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి తనకు పరిహారం అందేలా చూడటంతో పాటు సంబంధిత కంపెనీ,డీలర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని రైతు కుంటూరి రాజయ్య డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలి

జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఉపాధి పనుల విస్తరణకు చర్యలు తీసుకోవాలి
వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 23(ప్రజా కలం): జిల్లాలో వీబీబి రాం ఉపాధి హామీ పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం , తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జల సంరక్షణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న కాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని సూచించారు. ప్రస్తుతం రోజువారీ సగటున 60 మందికి ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో సగటున 45 మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకొని, ఆ సంఖ్యను స్థిరంగా కొనసాగించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికతీత వంటి సామూహిక పనులను విస్తృతంగా చేపట్టాలని, పనుల షెల్ఫ్‌ను 200 శాతానికి పెంచాలని సూచించారు. సెప్టెంబర్ నెలకు నిర్దేశించిన మూడు లక్షల లక్ష్యంలో ఇప్పటివరకు రెండు లక్షల మేర పురోగతి సాధించినందున, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.జిల్లాలో ఫార్మ్ పాండ్ల నిర్మాణానికి సంబంధించి 1,250 లక్ష్యానికి గాను 1,256 మంజూరు చేయగా, ఇప్పటివరకు 828 పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులకు సంబంధించి మంజూరు, నిర్మాణ ప్రక్రియను సమన్వయంతో చేపట్టి రానున్న రెండు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే మ్యాజిక్ సోక్‌పిట్స్, కమ్యూనిటీ సోక్‌పిట్స్, డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్స్ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి సోమవారం లోగా మంజూరుల ప్రక్రియను పూర్తి చేయాలని, అక్టోబర్ 31 నాటికి మ్యాజిక్ సోక్‌పిట్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఎంపీవోలు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలకు సంబంధించి జిల్లాలో 177 లక్ష్యానికి గాను 118 పనులకు మంజూరు లభించిందని అధికారులు తెలిపారు. మిగిలిన పనుల పురోగతిని సమీక్షిస్తూ, తాగునీటి వనరుల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కింద మిగిలి ఉన్న 918 మంజూరులను డీఆర్‌డీఏ, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు అర్హులైన లబ్ధిదారులకు మరుగుదొడ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడత నిర్మాణ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మొత్తం 11,654 ఇళ్ల లక్ష్యానికి సంబంధించి 10,901 ఇళ్లకు ప్రొసీడింగ్స్ జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మిగిలి ఉన్న 860 ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రెండో విడతలో 4,953 కొత్త ఇళ్లు, 1,772 పైకప్పుల మార్పిడి పనులు కలిపి మొత్తం 6,725 ఇళ్లకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని తెలిపారు. సంబంధిత శాసనసభ్యుల ప్రతిపాదనలు, గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ అనంతరం నిబంధనల ప్రకారం మంజూరు ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని సూచించారు.

ప్రజలకు ఉపాధి కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, జల సంరక్షణ, పారిశుద్ధ్యం, పేదలకు గృహ వసతి కల్పన వంటి అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డిప్యూటీ సీఈఓ పి. నరేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, హౌసింగ్ పీడీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, ఎంపీడీవోలు,ఎంపీవోలు, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి



- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23:

జిల్లాలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి మండల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరుతడి పంటల సాగుపై రైతులకు వివరించాలని, నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రైతులు ఈ అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండలాల వారీగా పంటల వైవిధ్యీకరణ ప్రణాళికలను రూపొందించి, గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర, వరి సన్న ధాన్యం కొనుగోళ్లు, పత్తి పంట కోతలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు కూరగాయల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని, యాసంగిలో విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గుల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి పొదుపు సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా తక్కువ నీటితో విజయవంతంగా పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారు అనుసరిస్తున్న పద్ధతులను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా జిల్లాలో నీటి పొదుపు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు.

పిఎం శ్రీ పాఠశాలల్లో ఎడ్యుకేటర్ల

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం, అక్టోబర్ 23 : (ప్రజాకలం ప్రతినిధి) జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని 11 పీఎం శ్రీ పాఠశాలల్లో చదువు తున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఐదు నెలల పాటు బోధించేందు కు (జిఎస్ఎన్) గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను తాత్కాలిక పద్ధతి లో నియమించనున్నట్లు మల్లాపూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కడారి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 26వ తేదీ లోపు తమ దరఖాస్తులను అంద జేయాలని ప్రిన్సిపాల్ కడారి అరుణ సూచించారు. ఎంపికైన ఎడ్యుకేటర్ కు నెలకు 16500 రూపాయల గౌరవ వేతనం అందించ నున్నట్లు జిల్లా విద్య అధికారి ఆదేశాల మేరకు దరఖాస్తులను ఆహ్వా నిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కడారి అరుణ తెలిపారు.

రైస్ మిల్లర్లు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

బకాయిలు చెల్లించకుంటే మిల్లర్ల ఆస్తులు జప్తు
అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) డిఫాల్ట్ రైస్ మిల్లర్లు తమ పెండింగ్ బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం 45 రోజుల గడువు కల్పించిందని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు.శుక్రవారం సమీక్షిత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులు,డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువును డిఫాల్ట్ రైస్ మిల్లర్లు సద్వినియోగం చేసుకొని,తమకు సంబంధించిన పెండింగ్ బకాయిలన్నింటినీ నిర్ణీత గడువులోగా చెల్లించాలని సూచించారు.డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు సంబంధించిన స్థిర,చర ఆస్తుల వివరాలను సబ్ రిజిస్ట్రార్ అధికారులు గుర్తించి,పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన 45 రోజుల గడువులోగా బకాయిలు చెల్లించని పక్షంలో సంబంధిత రైస్ మిల్లర్ల ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్డీఓ గంగయ్య,జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,పౌరసరఫరాల మేనేజర్ శ్రీకాంత్, సబ్ రిజిస్ట్రార్ అధికారులు,సంబంధిత అధికారులు,డిఫాల్ట్ రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్
ఎంఐఎం పట్టణ నూతన కమిటీ నియామకం



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) పెద్దపల్లి ఎంఐఎం పట్టణ అధ్యక్షుడిగా సయ్యద్ ఉమేర్ అహ్మద్‌ను నియమిస్తూ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు.ఎంఐఎం అధినేత,హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దారుస్సలాం కార్యాలయంలో నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా అడ్వకేట్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా కలీమ్,జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ ముజాహిద్, ఇర్ఫాన్ అలీ,ఖాజా మోహినుద్దీన్,షేక్ బర్కత్,కోశాధికారిగా ముఫ్తీ ఇంతియాజ్ ఖాన్ అసాధి,ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా షేక్ పర్వేజ్,ఇమ్రానోద్దీన్,ముజీబోద్దీన్,ఫుర్ఖాన్, ముజీబ్ ఖాన్,షోయబ్ ఖాన్‌లు నియమితులయ్యారు.ఈ సందర్భంగా గులాం అహ్మద్ మాట్లాడుతూ నూతన కమిటీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని,క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఒవైసీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అండగా నిలవాలని ఆయన సూచించారు.

మెట్‌పల్లిలో ఘర్షణ..

పలువురికి తీవ్ర గాయాలు
బీరు సీసాలు, కట్టెలు,ఇటుకలతో దాడి..
పలువురిపై కేసు నమోదు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 23(ప్రజా కలం) బతుకమ్మ నిమజ్జనం అనంతరం మెట్‌పల్లి పట్టణంలోని కాశీబాగ్ కాలనీలో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో గైని మహేశ్, గైని వంశీ, గైని అంజయ్య, గైని రాజులకు గాయాలైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం ప్రకారం.. అక్టోబర్ 23న బతుకమ్మ నిమజ్జనం అనంతరం గైని మహేశ్ తన మోటార్ సైకిల్‌పై చిట్టి అనే మహిళను వట్టి వాగు నుంచి కాశీబాగ్ కాలనీలోని ఇంటికి తీసుకెళ్తున్నాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కాలనీ సమీపంలో ఎదురుగా మోటార్ సైకిళ్లపై వేగంగా వస్తున్న కొందరిని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది.

దీంతో వారు మహేశ్ ను దుర్భాషలాడుతూ దాడి చేసి, చంపేస్తామని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అడ్డుకునేందుకు వచ్చిన గైని అంజయ్యపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. సమాచారం అందుకుని అక్కడికి వచ్చిన గైని వంశీ, గైని రాజుల పైనా కూడా దాడి చేసినట్లు ఫిర్యాదులో తెలిపారు. వంశీపై చేతులతో, బీరు సీసాలు, కట్టెలతో దాడి చేయగా, రాజుపై ఇటుక పెళ్లలతో దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో వంశీ చేతులకు, రాజు ఎడమ కంటికి, అంజయ్య చేతులకు తీవ్ర గాయాలైనట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సోమిడి ప్రశాంత్, జంగం మున్నా, ఆపిల్ అలియాస్ నరసింహ, శశాంక్, సూర్యతో పాటు మరికొందరిపై ఫిర్యాదు అందినట్లు పోలీసులు వెల్లడించారు. ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా కలం
శనివారం, అక్టోబర్ 24, 2026

దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్

ఢిల్లీ కేంద్రంగా జాతీయ స్థాయిలో సంచలనం సృష్టిస్తూ, ఉత్తరాది ప్రసార మాధ్యమాల్లో రోజంతా అగ్రస్థానంలో నిలుస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాలు దక్షిణాది రాష్ట్రాలకు వచ్చేసరికి పూర్తిగా నిస్తేజంగా మారాయి. ఢిల్లీ విధుల్లో సామాజిక మాధ్యమాలు, డిజిటల్ మిమ్‌ల ఆధారంగా సాగుతున్న ఈ వినూత్న పొలిటికల్ ట్రెండ్స్‌ను నేషనల్ మీడియా సర్వస్వంగా భావించి ప్రసారం చేస్తున్నప్పటికీ, దక్షిణాదిలో మాత్రం దీనికి కనీస ఆదరణ కూడా లభించడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ప్రధాన దక్షిణ భారత ప్రాంతాల్లో ఈ ఉద్యమం కనీస ప్రభావం చూపలేక చతికిలబడింది. ఇక్కడి స్థానిక మీడియా సంస్థలు అక్కడక్కడ కొన్ని వార్తలు ప్రచురించే ప్రయత్నం చేసినా, సాధారణ ప్రజానీకం, యువత దీనిని ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.ఢిల్లీ , ఉత్తరాదిలోని ప్రధాన నగరాల్లో భారీగా వైరల్ అవుతున్న ఈ ట్రెండ్‌ను దక్షిణాది సమాజం, ముఖ్యంగా ఇక్కడి యువత పూర్తిగా తిరస్కరించడానికి ఇక్కడి ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక పరిస్థితులే ప్రధాన కారణమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉత్తరాదిలోని రాజకీయ వాతావరణం, అక్కడి నిరుద్యోగ నిరసన తీరుకు, దక్షిణాది యువత ఆలోచనా ధోరణికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉంది. కాలక్షేపం కోసమో లేదా సోషల్ మీడియాలో సంచలనం కోసమో చేసే ఉద్యమాల కంటే.. తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి , ఆర్థిక స్వావలంబనే ప్రాథమిక లక్ష్యమని భావించే దక్షిణాది యువత ప్రాగ్మాటిక్ ఆలోచనా విధానమే ఈ కాక్రోచ్ ఉద్యమాలు ఇక్కడ అడుగుపెట్టకుండా నిరోధించింది. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులు సుదీర్ఘకాలంగా సమాచార సాంకేతిక రంగం , తయారీ రంగం, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు , స్టార్టప్ రంగానికి కేంద్రబిందువులుగా ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో యువత తమ దృష్టినంతా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , కొత్త నైపుణ్యాల అప్‌గ్రేడేషన్ . ఐటీ, గ్లోబల్ పరిశ్రమల్లో అవకాశాల సాధనపైనే నిలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ నిరసనల పేరిట కాలం వృథా చేసుకోవడం కంటే, గ్లోబల్ మార్కెట్‌లో తమ అర్హతలను పెంచుకోవడం మరియు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.దక్షిణాదిలో ప్రాంతీయ రాజకీయ చైతన్యం చాలా బలంగా ఉంటుంది. తమిళనాడులోని ద్రవిడ సిద్ధాంతం, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌లలోని బలమైన స్థానిక ప్రాంతీయ పార్టీలు, శ్రేణుల నిర్మాణం కారణంగా.. బయటి నుంచి దిగుమతి అయ్యే డిజిటల్ పొలిటికల్ సటైర్ ఉద్యమాలకు ఇక్కడ స్వతంత్ర స్పేస్ లభించడం లేదు. క్షేత్రస్థాయి సమస్యలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రాజెక్టుల పురోగతిపైనే ఇక్కడి రాజకీయ చర్చలు నడుస్తాయి తప్ప, ఢిల్లీ వీధుల్లో పుట్టుకొచ్చే తాత్కాలిక మిమ్ ట్రెండ్స్ ఇక్కడి ప్రజల మద్దతును పొందలేవు.ఢిల్లీలో పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ప్రధానంగా ఎక్స్ , ఆన్‌లైన్ నిరసనలకు పరిమితమైన ఒక ట్రెండ్ మాత్రమే. దక్షిణాది యువత డిజిటల్ మాధ్యమాలను విజ్ఞానార్జనకు, గిగ్ ఎకానమీలో అవకాశాలకు, లేదా వినోదానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు తప్ప, తమ భవిష్యత్తును పణంగా పెట్టి అర్థం లేని ఉద్యమాల వెనుక పరిగెత్తడం లేదు. పొరుగున ఉన్న విద్యార్థులు, యువత నైపుణ్య ఆధారిత కోర్సులు, పోటీ పరీక్షల శిక్షణపై దృష్టి సారించడాన్ని ఇక్కడ ప్రాధాన్య అంశంగా చూస్తున్నారు. దక్షిణాదిలో యూత్ ఎందుకు వీటిపై ఆసక్తి చూపడం లేదో పరిశీలిస్తే.. ఇక్కడి యువత ఎప్పుడూ ఖాళీగా ఉండరనే వాస్తవం స్పష్టమవుతుంది. ఐటీ రంగాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, పారిశ్రామిక కారిడార్లు, సాంకేతిక , సేవారంగాలు విస్తరించి ఉన్న దక్షిణ భారతదేశంలో యువత తమ కెరీర్ నిర్మాణమే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. గ్లోబల్ కాంపిటీషన్ ఎదుర్కొంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తీవ్రంగా శ్రమించే యువతకు, ఇలాంటి ప్రయోగాత్మక, వ్యంగ్య రాజకీయ ఉద్యమాల వైపు దృష్టి పెట్టేందుకు సమయం ఉండదు. కేవలం సోషల్ మీడియాలో రీక్రియేషన్ కోసం చూసి వదిలేయడమే తప్ప, వీటిని సీరియస్‌గా తీసుకునేంత ఖాళీ వాతావరణం ఇక్కడ కనిపించదు.అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలోని విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల రాజకీయాల ప్రభావం ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువ. క్యాంపస్‌లలో ప్రత్యక్ష రాజకీయాల ప్రమేయం, యూనివర్సిటీల జోక్యం చాలా వరకు పరిమితంగా ఉంటుంది.విద్యార్థులు చదువు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, ఉన్నత చదువుల వైపు దృష్టి సారిస్తారే తప్ప, ఇలాంటి నిరసనలు, అరాచక తరహా ఉద్యమాల వైపు ఆకర్షితులు కారు. కాలేజీ రోజుల్లోనే భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఉండే దక్షిణాది విద్యార్థులు, భావోద్వేగాల కంటే కెరీర్ నిలదొక్కుకోవడానికే తొలి ప్రాధాన్యత ఇస్తారు.మరోవైపు, దక్షిణాది రాజకీయ సంస్కృతి కూడా పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీల ప్రభావం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలే తప్ప, ఇలాంటి విచిత్రమైన నామకరణాలతో కూడిన ఉద్యమాలు స్థానిక ప్రజలను ఆకట్టుకోలేవు. ఉత్తరాదిలో నిరుద్యోగ నిరాశ నిస్పృహల నుంచి పుట్టుకొచ్చిన కొన్ని వ్యంగ్య ధోరణులు అక్కడ చర్చనీయాంశం కావొచ్చు, కానీ ప్రయోజనాత్మక దృక్పథం కలిగిన దక్షిణ భారతదేశం మాత్రం ఇలాంటి ట్రెండ్స్‌ను ఎప్పుడూ పక్కన పెడుతూ వస్తోంది. మీడియా ఎంతగా హోరెత్తించినా దక్షిణాదిలో కాక్రోచ్ ఉద్యమాలకు జీరో క్రేజ్ దక్కడం వెనుక ఇక్కడి యువత మెచ్యూరిటీ స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కాలక్షేపం కంటెంట్ కంటే తమ ఉజ్వల భవిష్యత్తు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనే ముఖ్యమమని భావించే ఇక్కడి యువత ఆలోచనా విధానమే, ఈ ఉద్యమాలను ఇక్కడ కనీస ప్రభావం కూడా చూపకుండా అడ్డుకుంటోంది. ఉత్తరాది మీడియా ఎంత హడావుడి చేసినా, దేశీయ రాజకీయాల్లో ప్రభావం చూపుతుందని ప్రచారం చేసినా, దక్షిణాది ప్రగతిశీల సమాజం దానికి పూర్తిగా దూరంగా నిలిచింది. కేవలం డిజిటల్ సంచలనాల ఆధారంగా నడిచే రాజకీయ ఉద్యమాలకు కాలం చెల్లిందని, ప్రగతి సాధన, ఆర్థిక పురోగతే ఏకైక అజెండా అని దక్షిణాది యువత తమ నిశ్శబ్ద తిరస్కరణ ద్వారా మరోసారి స్పష్టం చేసింది.

రేవంత్ సర్కార్ నిర్లక్ష్యంతోనే కృత్రిమ కరువు

-బీఆర్ఎస్ నేతలు బొడ్డు రవీందర్,ఉప్పు రాజ్‌కుమార్
-కాళేశ్వరం పునరుజ్జీవం కోసమే 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర
-అక్టోబర్ 28న మేడిగడ్డ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు యాత్ర



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ,రైతాంగానికి తక్షణమే సాగునీటి విడుదల డిమాండ్‌తో ఈ నెల 28 నుంచి మేడిగడ్డ బ్యారేజ్ నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు సుమారు 400 కిలోమీటర్ల మేర మహా సైకిల్ యాత్రను చేపడుతున్నట్లు బీఆర్ఎస్ గోదావరిఖని పట్టణ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్,బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ సంయుక్తంగా ప్రకటించారు.శుక్రవారం పెద్దపల్లి కమాన్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొడ్డు రవీందర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి దశాబ్దాల తెలంగాణ నీటి గోసను తీర్చారని గుర్తుచేశారు.అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేవలం కేసీఆర్‌పై ఉన్న రాజకీయ అక్కసుతోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చి,రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించిందని మండిపడ్డారు.మేడిగడ్డ వద్ద 80 పిల్లర్లలో ఒకటి రెండు పిల్లర్లకు సమస్య వస్తే,చిన్నపాటి గ్రౌటింగ్ లేదా తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే పట్టించుకోవడం లేదని ఆరోపించారు.నిత్యం 20 వేల క్యూసెక్కులకు పైగా గోదావరి జలాలు వృథాగా సముద్రం పాలవుతున్నా,90-93 మీటర్ల లెవెల్ ఉన్నప్పుడు పంపులు ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు.ప్రాజెక్టులోని వందల కిలోమీటర్ల టన్నెల్స్,పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు అన్నీ సక్రమంగా ఉన్నా,మొత్తం ప్రాజెక్టే పనికిరాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

10 నియోజకవర్గాల మీదుగా సాగనున్న సైకిల్ యాత్ర

-బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్

గతంలో గోదావరి కన్నీటి గోస పేరుతో 180 కిలోమీటర్ల పాదయాత్ర చేసినప్పటికీ ప్రభుత్వంలో ఎలాంటి చలనం రాలేదని బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు రెండో పంట వేసుకోవద్దని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని,రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుంటూ ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఈ 400 కి.మీ. సైకిల్ యాత్రను చేపడుతున్నామని వివరించారు.ఈ యాత్ర అక్టోబర్ 28న మేడిగడ్డ వద్ద ప్రారంభమై దాదాపు 10 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా సాగి కొండపోచమ్మ సాగర్ వద్ద ముగుస్తుందని తెలిపారు.కాళేశ్వరం పునరుజ్జీవం కోసం తాము చేపట్టే ఈ పోరాటానికి తెలంగాణవాదులు, ఉద్యమకారులు,యువత,రైతులు,పాత్రికేయ మిత్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాశిపాక వాసు,పల్లె మధు,లక్ష్మణ్ గౌడ్,ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న ప్రాణదాతలు

- గర్భిణీకి రక్తదానం చేసిన ముగ్గురు యువకులు



పెద్దపల్లి,అక్టోబర్23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) అత్యవసర పరిస్థితుల్లో స్పందించి రక్తం అందించడం ద్వారా ముగ్గురు యువకులు నిండు ప్రాణాన్ని నిలబెట్టి మానవత్వాన్ని చాటుకున్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గర్భిణీకి అకస్మాత్తుగా రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న ఉమేష్,శ్రీనివాస్,బండి నరేష్‌లు ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.సకాలంలో స్పందించి ప్రాణదాతలుగా నిలిచిన వీరిని పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి పాంపాటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తం అందించడం అత్యున్నతమైన సేవ అని కొనియాడారు.ప్రసవ సమయంలో గర్భిణీలకు,రోడ్డు ప్రమాద బాధితులకు రక్త కొరత ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని,ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నిమ్మనపల్లి సర్పంచ్ వేల్పుల రమేష్,బి2 ఫౌండేషన్ చైర్మన్ బెజ్జంకి నరేష్,యాక్టివ్ బ్లడ్ డోనర్స్ బండి శ్రీకాంత్,కేస శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
కంతి మోహన్ రెడ్డికి ఘన సన్మానం

పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతే జనసమితి పార్టీ లక్ష్యం - కంతి మోహన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 23(ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ జనసమితి పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేసిన కంతి మోహన్ రెడ్డి తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాశీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా కంతి మోహన్ రెడ్డి. స్వగ్రామమైన ఇబ్రహీంపట్నంలోని కొత్త బస్‌స్టాండ్ ప్రాంతంలో శుక్రవారం తెలంగాణ జనసమితి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామంలోని వివిధ కుల సంఘాల పెద్దల ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ,కంతి మోహన్ రెడ్డి. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఆయనకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపదవి దక్కడం పార్టీకి, ఇబ్రహీంపట్నం ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు.ఈ సందర్భంగా కంతి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ జనసమితి పార్టీ పేదలు, రైతులు, బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కొత్త బాధ్యతను సద్వినియోగం చేసుకుంటూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం, రైతుల సంక్షేమం కోసం, సామాజిక న్యాయం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణం ఎల్లప్పుడూ పేదలు, సామాన్య ప్రజల పక్షాన కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలందరికీ కంతి మోహన్ రెడ్డి. ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్. తెలంగాణ జన సమితి పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు.జిల్లపెల్లి దిలీప్ కుమార్.మండల పార్టీ అధ్యక్షులు.కంతి రమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు ఏశాల గంగా రెడ్డి.రెబ్బటి మల్లయ్య యాదవ్, నందగోపాల్, గజ్జ రాజేందర్, కనుక కృష్ణ, గంగాధర్, చిన్నయ్య, గూడా రాజారెడ్డి, కాట దశరథ్ రెడ్డి, పెద్దబోయిన రమేష్, గడ్డమీద నరేందర్, బద్ది రాములు, కంతి మోసే, సంజీవ్, కంతి కరుణాకర్, గజ్జ రాజశేఖర్, ఎండీ సలీం, సిరాజ్, కనక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తృతం కావాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గం



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మానవ సేవే పరమావధిగా ఆపదలో ఉన్న బాధితులకు నిరంతరం అండగా నిలుస్తూ,రెడ్‌క్రాస్ సేవలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తరించాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు ఆయనకు పరిచయం చేసుకుని,జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టబోయే పలు సేవా కార్యక్రమాల కార్యాచరణపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తనిధి ఎంతో కీలకమని,ఇందుకోసం గ్రామ,పట్టణ స్థాయిల్లో విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు.గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఆరోగ్యం,పరిశుభ్రతపై నిరంతరం అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో అర్హులకు సకాలంలో వైద్య,మానవతా సాయం అందేలా నూతన పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా నూతన చైర్మన్ ఎరబాటి వెంకటేశ్వర్ రావు,వైస్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు,కోశాధికారి పాంపాటి శ్రీకాంత్,స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు కావేటి రాజగోపాల్,జిల్లా కమిటీ సభ్యులు డీవీఎస్ మూర్తి,గూళ్ళ అంజన్ కుమార్,వేల్పుల రమేష్,వేల్పూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

నీటికి గడువు తేదీ ఉంటుందా..?

ఎండపల్లి, అక్టోబర్ 23 : (ప్రజా కలం ప్రతినిధి)

నీటికీ గడువు తేదీ (ఎక్స్పైర్ డేట్) ఉంటుందా.? కొంతమంది ఒక్క రోజు పాతబడిన నీటిని కూడా పారబోసేస్తుంటారు. మరికొందరు వారం రోజుల పాటు నిల్వ ఉంచిన నీటిని తాగు తుంటారు. అదే సమయం లో వేల ఏళ్లుగా భూగర్భం లో ఉన్న నీటిని అత్యంత స్వచ్ఛమైనదిగా, సురక్షితమైనదిగా భావిస్తాం! అసలు నీటికి గడువు తేదీ ఉంటుందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిస్తే, నీటి పట్ల మీకున్న దృక్పథమే మారిపోవచ్చు. చాలా సందర్భాల్లో మనం మన సౌకర్యాన్ని బట్టి, మన ఆలోచనా ధోరణిని బట్టి నీటికి ఒక "గడువు తేదీ"ని నిర్ణయించేసుకుంటాం. కానీ వాస్తవానికి, ఇలాంటి నమ్మ కాలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదు. మన చుట్టూ ఉన్న కొన్ని ఆసక్తికరమైన ఉదా హరణలను గమ నించండి.

నగరాల్లో... మున్సిపాలిటీ ద్వారా ప్రతిరోజూ నీటి సరఫరా జరిగే చోట, ప్రజలు తరచు గా నిన్నటి నీటిని పాతబడి పోయాయని భావించి పారబోస్తుంటారు. (వీరి లెక్క ప్రకారం, నీటి గడువు కేవలం 1 రోజు మాత్రమే.)

వారానికి ఒకసారి నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో

అదే నీటిని రెండు నుండి ఎనిమిది రోజుల పాటు నిల్వ ఉంచి, ఎటువంటి సంకోచం లేకుండా తాగు తుంటారు. (వీరి లెక్క ప్రకారం, నీటి గడువు 2 నుండి 8 రోజులు) అని అనుకుంటారు.

పెళ్లిళ్లు, ఇతర సామాజిక కార్యక్రమాల్లో

కొత్తగా ఒక నీళ్ల బాటిల్‌ను తెరవగానే, అంతకు ముందు తెరిచిన బాటిల్‌ను పట్టించుకోకుండా పక్కన పడేయడం లేదా పార బోయడం చేస్తుంటారు. (వీరి లెక్క ప్రకారం, నీటి గడువు కేవలం కొన్ని నిమిషాలు లేదా గంటలు మాత్రమే) అనుకుంటారు కానీ అసలు నిజం వేరు

ఎడారి ప్రాంతాల్లో....ప్రయాణంలో ఉన్నప్పుడు, తదుపరి నీటి వనరు దొరికే వరకు ప్రతి చుక్క నీరు ఎంతో విలువైనదిగా, "తాజా"మైనదిగా పరిగ ణించబడుతుంది. (గడువు తేదీ మరో నీటి వనరు దొరికే వరకు)

ప్రకృతిలో

డ్యామ్‌లు, రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని తదుపరి వర్షాకాలం వచ్చే వరకు ఉపయోగిస్తారు. కరువు కాలంలో అయితే ఇవే నీరు రెండు మూడు ఏళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండవచ్చు. (గడువు తేదీ కొన్ని సంవత్సరాలు)

బోరు బావులు, భూగర్భ జలాశయాల్లో

50 నుండి 500 అడుగుల లోతు నుండి మనం తోడే నీరు, వందల లేదా వేల ఏళ్లుగా భూగర్భంలో నిల్వ ఉండి ఉండవచ్చు అయి నప్పటికీ, మనం దానిని అత్యంత సురక్షితమైన, ఆరోగ్యకరమైన తాగునీటి వనరుగా భావిస్తాం. (గడువు తేదీ వందలు లేదా వేల సంవత్సరాలు-బహుశా ఎప్పటికీ ఉండకపోవచ్చు)

ఆలోచించవలసిన ఒక విషయం

వాస్తవానికి నీటికి గడువు తేదీ ఉండదు. దాని ఉప యోగ యోగ్యతను నిర్ణ యించేవి కేవలం కాలం గడవడం కాదు, దాని శుభ్రత, నిల్వ పరిస్థితులు మరియు లభ్యత, నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు, మనం దానిని "పాతది" లేదా "నిరుపయోగమైనది" అని అంటాం. కొరత ఏర్పడి నప్పుడు, అదే నీరు అమృతం వలె అమూల్య మైనదిగా మారుతుంది. అందువల్ల మనం నీటిని బాధ్యతాయుతంగా వాడు కుందాం, ప్రతి నీటి చుక్కను పొదుపు చేద్దాం. లేకపోతే, భూమిపై నీరు అడుగంటిపోక ముందే, మన నిర్లక్ష్యం చేస్తే మనల్ని నీరు దాహంతో బాధపడేలా చేయవచ్చు.

ఒక వినయ పూర్వకమైన అభ్యర్థన

ఇది కేవలం ఒక సందేశం కాదు-ఇది మన భవిష్యత్తును కాపాడుకోమని చేసే పిలుపు. నీటి విలువ గురించి అవగాహన కల్పించడానికి దయచేసి ఈ సందేశాన్ని మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు సమాజంలో పాలు పంచుకొని నీటి గురించి మేలుకోవాలని. నీరే జీవం, నీరు ఉంటేనే మనకు రేపటి రోజు భవిష్యత్ ఉంటుంది. ఆరోగ్యంగా ఉండండి. సురక్షితంగా ఉండండి. నీటిని పొదుపు చేయండి.

– మాజీ సైనికులు ఎం వి ఆర్ రెడ్డి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదును
ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే అరురి రమేష్

(వరంగల్/పర్వతగిరి) అక్టోబర్ 23, ప్రజాకలం ప్రతినిధి:

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పర్వతగిరి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే



ఆరురి రమేష్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, తమ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్‌ను వ్యక్తిగతంగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకునేలా కృషి చేయాలని, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని కోరారు. ఈ ప్రక్రియను బాధ్యతగా నిర్వహిస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట నియోజకవర్గం పట్టపద్రుల ఓటర్ల నమోదు ఇన్చార్జి సయ్యద్ మసూద్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ పిఎస్ఎల్ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఏఎంసి డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్, మాజీ జడ్పిటిసి లూనావత్ పంతులు, మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల నాయకులు, పట్టబద్రుల ఓటర్ల నమోదు ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదును వేగవంతం చేయాలి

- కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుండేటి వీరారెడ్డి పిలుపు..
- పట్టభద్రులకు ఓటు నమోదుపై అవగాహన..



తల్లాడ. అక్టోబర్.23 ప్రజా కలం న్యూస్ : ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు పట్టబద్ధులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తల్లాడ పార్టీ కార్యాలయంలో ఓటు నమోదు కేంద్రాన్ని ప్రారంభించి పలువురు పట్టభద్రులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ ఆదేశాల మేరకు తల్లాడ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా తల్లాడ పట్టణంలో కూడా ఏర్పాటు చేసే విధంగా పట్టబద్ధులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 2023 లోపు సంవత్సరం డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరు ఓటు కోసం నమోదు చేసుకోవాలని, సమయం తక్కువగా ఉన్నందునా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో , పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సకట్ల బాబురావు, మండల ఉపాధ్యక్షులు తాళ్ల జోసెఫ్,రెడ్డి సంఘం జిల్లా నాయకులు వెంకటనారాయణ రెడ్డి,బొడ్డు వెంకటేశ్వరావు, నున్న శ్రీనివాసరావు, గొడుగునూరు శ్రీనివాసరెడ్డి, నరసింహారావు, తల్లాడ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొత్తపల్లి విజయ్,రామారావు,తల్లాడ పట్టబద్రులు పాల్గొన్నారు.


ప్రతిభకు అండగా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ

షూటర్ మారియాకు ఆర్థిక సాయం.



పాలేరు అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్)కూసుమంచిశుక్రవారం ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులు వెనుకబడకూడదనే ఉద్దేశంతో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కూసుమంచికి చెందిన మహమ్మద్ ఖదీర్ కుమార్తె మారియా తనీమ్ రైఫిల్ షూటింగ్‌లో రాణిస్తూ, జాతీయ జట్టు ట్రయల్స్‌లో పాల్గొంటోంది. కొత్త రైఫిల్ కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో కందాళను సంప్రదించగా, ఆయన ఆర్థిక సహాయం అందించారు.మారియా ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ కాలేజీలో స్పోర్ట్స్ కోటాలో ఎంబీఏ సీటు సాధించడంతో పాటు, షూటింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తోంది. ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కందాళ ఆకాంక్షించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన కందాళకు మారియా తండ్రి మహమ్మద్ ఖదీర్ కృతజ్ఞతలు తెలిపారు.

పేదరికాన్ని అధిగమించి పీజీ మెడికల్‌లో రాణించిన డాక్టర్ రూత్ జాన్ పాల్



ఖమ్మం అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్) ఖమ్మం నగరంలోని రమణగుట్ట మురికివాడకు చెందిన కొయ్యల రూత్ జాన్ పాల్ పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు . నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆమె ఎన్నో కష్టనష్టాలు , అవమానాలను ఎదుర్కొంటూ చదువే లక్ష్యంగా ముందుకు సాగారు . తల్లి దండ్రుల దగ్గర ఉంటూ హైస్కూల్ , ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసిన అనంతరం వైద్య విద్యపై ఉన్న ఆసక్తితో ఖమ్మంకు చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ కేవీ కృష్ణారావు తదితరుల సహకారంతో హైదరాబాద్‌లో ఎంసెట్ కోచింగ్ తీసుకున్నారు . అనంతరం ఎంబీబీఎస్ పూర్తి చేసి , హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ విభాగంలో పీజీ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు . పేదరికం తన లక్ష్యానికి అడ్డుకాదని నిరూపించిన డాక్టర్ రూత్ జాన్ పాల్‌ను పలువురు అభినందించారు . పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు , నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచి సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు .

తానూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

తానూర్,అక్టోబర్ 23(ప్రజా కలం): తానూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వెంకట మాధవరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు ముఖ్యమైన రెవెన్యూ రికార్డులను, రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలో ప్రస్తుతం కొనసాగుతున్న భూ సర్వే పురోగతిపై తహసీల్దార్ మహేందర్ నాథ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భూ సర్వే పనులను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, విధుల పట్ల నిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సబ్ కలెక్టర్ సూచించారు.



ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి

తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి - ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: కాడబోయిన లింగయ్య



ఐనవోలు, అక్టోబర్ 23:– (ప్రజాకలం ప్రతినిధి)

ఓటరు జాబితా సవరణ పేరుతో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. ప్రజాసంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ఐనవోలు మండల కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల హక్కులను హరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ముస్లిం మైనారిటీలు, క్రైస్తవులు, వామపక్ష, అభ్యుదయవాదులతో పాటు వివిధ వర్గాల ప్రజల ఓట్లను మతం, కులం, ప్రాంతం పేరుతో తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు.

ఓటు హక్కును కాపాడాలి

భారత రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలకు ఓటు హక్కు పునాది అని లింగయ్య పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఓటు హక్కు అత్యంత కీలకమని, అలాంటి ప్రాథమిక హక్కును దూరం చేసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వేలాది ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ, దీనికి ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానాలే కారణమని విమర్శించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడం దుర్మార్గమన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేసి, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుండెకారి మహేందర్, దీకొండ ఉప్పలయ్య, గుండెకారి బాబురావు, సీఐటీయూ నాయకులు జి. కుమార్, జి. చిన్న మహేందర్, జీఎంపీఎస్ మండల కార్యదర్శి నల్లబెల్ల చిన్నరాజు, కావటి బద్వేల్, చేరాలు, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకులు లెంకల నరసయ్య, వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు గుండెకారి రాజేశ్వరరావు, గుండెకారి చిన్న మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- వ్యవసాయ అధికారి ప్రమోద్ కుమార్



పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ఎల్-నినో ప్రభావం దృష్ట్యా రైతులు సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ,అధిక లాభాలనిచ్చే పామాయిల్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్,ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము సూచించారు.శుక్రవారం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని కన్నాల శివారులో రైతు పుప్పాల దయానంద్ సాగు చేస్తున్న పామాయిల్ తోటను వారు సందర్శించి మాట్లాడారు. ఎక్కువ నీరు తీసుకునే వరికి బదులు ఆయిల్ పామ్,కూరగాయలు,అపరాలు, నూనెగింజల పంటలు వేసుకోవాలని, బిందు-తుంపర సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వాడుతూ ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంచుకోవాలని కోరారు.భవిష్యత్తులో పశు గ్రాస కొరత రాకుండా వరి గడ్డిని కాల్చకుండా చుట్టలుగా నిల్వ చేయడంతో పాటు జొన్న,సూపర్ నేపియర్ వంటి మేత పంటలు సాగు చేయాలన్నారు.ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై అందే బిందు సేద్య పరికరాల కోసం రైతులు 8919896772 నెంబర్‌లో సంప్రదించాలని సూచించిన ఈ కార్యక్రమంలో అధికారులు బండి ప్రమోద్ కుమార్, బి.రాములతో పాటు రైతులు పుప్పాల దయానంద్,ఎడెల్లి వేణు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

నిబంధనలు ఉల్లంఘించే ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్అక్టోబర్ 23 (ప్రజాకలం) : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించినా, వాటికి సహకరించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో లింగ నిష్పత్తిని మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. తల్లి, శిశువు ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ నిర్దేశిత వైద్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు, గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిరోధించేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లింగ వివక్షకు తావులేకుండా సమాజంలో సమానత్వ భావనను పెంపొందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

13 ప్రైవేట్ ఆస్పత్రులు, 6 స్కానింగ్ కేంద్రాలకు అనుమతులు

జిల్లాలో 13 ప్రైవేట్ ఆస్పత్రులు, 6 స్కానింగ్ కేంద్రాలకు నూతన అనుమతులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, జిల్లాలో వైద్య సేవల పర్యవేక్షణను నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు.

సీపీఎం, వైసీపీ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి నక్కా నరసింహారావు నామినేషన్

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థన



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 23:

పోలవరం జిల్లా ఎటపాక మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎటపాక ఎంపీటీసీ స్థానానికి సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నక్కా నరసింహారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎటపాకలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా నక్కా నరసింహారావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎటపాక ఎంపీటీసీ స్థానంలో తనకు అవకాశం కల్పించి, తమ అమూల్యమైన ఓటును వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని ఆయన వెల్లడించారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, సీపీఎం పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

భూక్య భాస్కర్ అంతిమయాత్రలో పాల్గొన్న బొంపెల్లి దేవేందర్ రావు

- కాంగ్రెస్ కంటెస్ట్ జెడ్పిటిసి జాటోత్ శ్రీనివాస్ నాయక్



(వరంగల్/ పర్వతగిరి) అక్టోబర్ 23, ప్రజాకలం ప్రతినిధి: పర్వతగిరి మండలం గ్రామం మాల్యా తండా, గడ్డపార తండా జిపి సిబ్బంది అనారోగ్యంతో మరణించిన అంతిమయాత్రలో పాల్గొని భూక్య భాస్కర్ కుటుంబాన్ని పరామర్శించి మనోధ్యర్యం కల్పించి వారికి ఆర్థిక సాహాయం చేసిన కిసాన్ సేల్ జిల్లా అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు. జాటోత్ శ్రీనివాస్ నాయక్ కాంటెస్ట్ జెడ్పిటిసి మాట్లాడుతూ, భూక్య భాస్కర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా అన్ని విధాల సాయం అందజేస్తామని ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చిరు. అంతిమయాత్రలో పాల్గొన్న భూక్య మంజుల శ్రీనివాస్ సర్పంచ్ మాల్యా తండా, తొర్రి పద్మ యాదవ్ ఏనుగల్ సర్పంచ్, ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బూత్ కన్వీనర్లు, గ్రామ పెద్దలు గ్రామవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల సాధనలో అండగా ఉంటాం

-ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మెకు టీఎన్జీవోస్ సంఘీభావం

పెద్దపల్లి,అక్టోబర్ 23:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు



తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు టీఎన్జీవోస్ పెద్దపల్లి జిల్లా శాఖ పూర్తి సంఘీభావం ప్రకటించింది.శుక్రవారం భోజన విరామ సమయంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు,ఉద్యోగుల జేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్,జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు సమ్మె శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,తక్షణమే వారితో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.దీర్ఘకాలంగా సేవలందిస్తున్న వీరిని వెంటనే క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని,మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయడంతో పాటు అందరికీ ఈహెచ్ఎస్ ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో టీఎన్జీవోస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఆడెపు శ్రీనివాస్,వీరగోని శ్రీనివాస్, మహేందర్ రెడ్డి,శ్రీధర్,ప్రవీణ్,ప్రేమ్ సాగర్, రవి,రాజేష్,లక్ష్మణ్,రమేష్,మధు,మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

చేగొమ్మ రైతు వేదికలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారుల అవగాహన



పాలేరు అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్)

చేగొమ్మ రైతు వేదికలో రైతులకు వివిధ వ్యవసాయ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'కేత్ బచావో అభియాన్' పథకం ద్వారా భూసంరక్షణ, నేల నాణ్యతను మెరుగుపరచడం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు తప్పనిసరిగా సంబంధిత కంపెనీతో ఒప్పందం (అగ్రిమెంట్) చేసుకోవాలని సూచించారు. దీనివల్ల సాగుకు సంబంధించిన నిబంధనలు, ఇతర అంశాలపై స్పష్టత ఉంటుందని వివరించారు.

యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని రామడుగు వాణి సూచించారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేసుకునే పెసర, మినుము, వేరుశనగ, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సైదులు, చేగొమ్మ, ముత్యాలగూడెం గ్రామాల సర్పంచులు, ఏఈఓ రవి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో బియ్యం దుకాణాల్లో పౌరసరఫరాల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు



ఖమ్మం, అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం వ్యాపారుల దుకాణాల్లో డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా, వ్యాపారులు సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల నుండి కొనుగోలు చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులు, వే బిల్లులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ప్రతి దుకాణం ప్రధాన ద్వారం వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల పరిమాణం, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు.హోబియ్యాన్ని అధిక ధరలకు విక్రయించడం గానీ, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం గానీ చేయరాదని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు.హోనిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ పరేడ్‌కు ఖమ్మం ఎకో-క్లబ్‌కు ఆహ్వానం

ఖమ్మం అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్) ఖమ్మం జిల్లాకు చెందిన ఎకో-క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీకి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది .



అక్టోబర్ 31న గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నిర్వహించనున్న జాతీయ ఐక్యతా దినోత్సవ పరేడ్‌లో పాల్గొనేందుకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. కడవెండి వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శి కె. అరుణ కుమారికి ఆహ్వాన పానులు అందాయి . సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్నారు . జాతీయ సమైక్యత , సమగ్రత , భిన్నత్వంలో ఏకత్వం చాటిచెప్పే ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమని సంస్థ ప్రతినిధులు తెలిపారు . ఈ సందర్భంగా డా. వేణుగోపాల్ మాట్లాడుతూ జాతీయ ఐక్యతా స్ఫూర్తితో పాటు 'ప్లాస్టిక్ రహిత భారత్ -- పచ్చని భారత్' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమన్నారు . సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం , మొక్కలు నాటడం , పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడి బాధ్యతని పేర్కొన్నారు . పర్యావరణ పరిరక్షణ , ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ , పచ్చదనంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు . ఖమ్మం నుంచి జాతీయ స్థాయి వేడుకల్లో పాల్గొనే అవకాశం లభించడం పట్ల ఎకో-క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు .

రాణాపూర్ తండాలో ఫైనాన్షియల్ సాచురేషన్ అవగాహన కార్యక్రమం



నిర్మల్ అక్టోబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) దేశంలో ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్, ఆర్థిక సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలనే ప్రధాన లక్ష్యంతో చేపట్టిన దేశవ్యాప్త ముమ్మర ఫైనాన్షియల్ సాచురేషన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం, నిర్మల్ గ్రామీణ మండలంలోని రాణాపూర్ తండాలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ స్థాయిలోని చివరి వ్యక్తి వరకు బ్యాంకింగ్ సేవలను చేరవేయడం, ప్రతీ ఒక్కరినీ ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యులను చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఆర్థిక అవగాహనపై దిశానిర్దేశం చేశారు. సాధారణ ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకింగ్ వ్యవస్థ కల్పిస్తున్న సౌకర్యాలు, పొదుపు పథకాలు, డిజిటల్ ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాలను గురించి వారు సమగ్రంగా వివరించారు. రిజర్వ్ బ్యాంక్ చేపడుతున్న ఈ ప్రచార కార్యక్రమం వల్ల ఆర్థిక భద్రత పెరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న బ్యాంకింగ్ అధికారులు తండా వాసులకు వివిధ ప్రభుత్వ ఆర్థిక సంక్షేమ పథకాలు, ప్రధాన మంత్రి జన ధన్ యోజన, సామాజిక భద్రతా బీమా పథకాలు, సూక్ష్మ రుణాలు పొందే విధానాలపై వివరణాత్మకమైన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, డిజిటల్ బ్యాంకింగ్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా అధికారుల బృందం క్షుణ్ణంగా వివరించింది. ఈ కార్యక్రమంలో ఆర్బిఐ ఏజీఎం రాములు, శ్రీనివాస్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, గ్రామ సర్పంచ్ నెహ్రూ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీతో ఘనంగా కూటమి అభ్యర్థి బాచినేని శ్రీకాంత్ నామినేషన్

- నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు
- ఎటపాక ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు

ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 23:

పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని ఎటపాక మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి నెలకొంది. ఎటపాక ఎంపీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాచినేని శ్రీకాంత్ శుక్రవారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి ముందు నిర్వహించిన బైక్ ర్యాలీతో ఎటపాకలో సందడి వాతావరణం నెలకొంది. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

బైక్ ర్యాలీతో కూటమి శ్రేణుల సందడి

బాచినేని శ్రీకాంత్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. ద్విచక్ర వాహనాలపై నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో ఎటపాకలో ఎన్నికల సందడి కనిపించింది. నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి కూటమి శ్రేణులు చేరుకోవడంతో స్థానికంగా రాజకీయ వాతావరణం వేడెక్కింది.

ఎంపీటీసీ స్థానానికి నామినేషన్... స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా బాచినేని శ్రీకాంత్ ఎటపాక ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అభ్యర్థి నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కూటమి శ్రేణుల్లో ఉత్సాహం కనిపించింది.



మండలంలో ఊపందుకున్న ఎన్నికల సందడి

ఎటపాక మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకుంటున్నాయి. గ్రామాల్లో ఎన్నికలపై చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండటంతో రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత విస్తరించనుంది. ఎటపాక ఎంపీటీసీ స్థానానికి బాచినేని శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేయడం స్థానిక రాజకీయ పరిణామాల్లో భాగంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- వీరన్నపేటలో బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల నిర్మాణానికి స్థల పరిశీలన - మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 23:

మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించే లక్ష్యంతో నగరంలోని వీరన్నపేటలో నూతనంగా నిర్మించనున్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల (1, 2) నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి స్థల పరిశీలన చేశారు. విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థినులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వారి విద్యాభివృద్ధికి అవసరమైన వసతి సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ అధునాతన విద్యాసంస్థల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడం ద్వారా వారు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు, భవిష్యత్తులో వివిధ రంగాల్లో రాణించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. వీరన్నపేటలో నిర్మించనున్న ఈ విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తే మైనారిటీ బాలికలకు విద్యతో పాటు మంచి వసతి సౌకర్యాలు లభించనున్నాయి. తద్వారా విద్యార్థినులు తమ చదువుపై మరింత దృష్టి సారించేందుకు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడనుంది. బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యారంగంలో సమాన అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ హామీ
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 11వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

నాగర్‌కర్నూల్ అక్టోబర్ 23(ప్రజా కలం): జిల్లాలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకొని, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమ్మె శిబిరంలో సుమారు 300 మంది ఆరోగ్య సిబ్బంది, వైద్యులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఒకరోజు భోజన ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరోగ్య శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా ఆరోగ్య శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వివరించారు.

సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అవసరమైతే సోమవారం మరోసారి సంబంధిత మంత్రిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

ఉద్యోగుల నిరవధిక సమ్మె కారణంగా ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొంటూ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం జేఏసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి దామగట్ల కుమార్ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంపై జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.



టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు తరలిరావాలి - టి.డబ్ల్యూ.జె.ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. పరిపూర్ణం, పి. వెంకటస్వామి పిలుపు



నాగర్‌కర్నూల్ బ్యూరో, అక్టోబర్ 23 (ప్రజాకలం): వచ్చే నెల 15న నిర్వహించనున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. పరిపూర్ణం, జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, సంఘం నాయకులు రాష్ట్ర మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ హౌదేకర్ నవీన్ అధ్యక్షతన రాష్ట్ర మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల నిర్వహణ, నాయకులు, జర్నలిస్టుల భాగస్వామ్యం, సంఘం బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రతతో పాటు సంఘటిత శక్తిని మరింత బలోపేతం చేయడంలో ప్రతి జర్నలిస్టు భాగస్వామి కావాలని నాయకులు సూచించారు. రాష్ట్ర మహాసభలు జర్నలిస్టుల సమస్యలపై చర్చించడానికి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి వేదికగా నిలవనున్న నేపథ్యంలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొని సంఘం ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏ. పరిపూర్ణం, ప్రధాన కార్యదర్శి పి. వెంకటస్వామి, ఉపాధ్యక్షులు సయ్యద్ షఫీ, వెంకటేష్, గద్దం బంగారయ్య, కోశాధికారి బాదం పరమేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హౌదేకర్ నవీన్, సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా నుంచి ఐదుగురు ఎంపిక

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగడం గర్వకారణం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. విజేందర్ యాదవ్

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 23 (ప్రజాకలం) : 41వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఐదుగురు అథ్లెట్లు ఎంపికయ్యారు. అక్టోబర్ 23 నుంచి 27 వరకు చెన్నైలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు తెలంగాణ రాష్ట్రం తరఫున వివిధ విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు.జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. అండర్-18 బాలుర 1000 మీటర్ల పరుగులో దొడ్డి సంతోష్ కుమార్,



అండర్-20 బాలుర 4ఐ100 మీటర్ల రిలేలో అథపు గణేష్, అండర్-16 బాలుర లాంగ్‌జంప్‌లో అంకురి దిల్వాన్, అండర్-20 బాలికల స్టీపుల్‌చేజ్‌లో స్వప్న కొడావత్, అండర్-16 బాలికల హైజంప్‌లో శ్రీవల్లి ఎంపికయ్యారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ జట్టు మేనేజర్‌గా డాక్టర్ సోలపోగుల స్వాములు ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభతో జాతీయ స్థాయికి ఎదగడం జిల్లా క్రీడారంగానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అథ్లెటిక్స్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. విజేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. జాతీయ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి తెలంగాణ రాష్ట్రానికి, నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. క్రీడాకారుల ఎంపికపై ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

ఎస్ఐఆర్‌ను రద్దు చేసి తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు



నాగర్‌కర్నూల్, అక్టోబర్ 23 (ప్రజా కలం):కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని, దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత నెల రోజులుగా ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో 13 కోట్ల ఓట్లు, రాష్ట్రంలో 73 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొంటూ, వాటిని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని, ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ జరుగుతున్న ఉద్యమాల్లో పాల్గొన్న యువతీ యువకులు, విద్యార్థులు, నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు.భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి లౌకిక ప్రజాస్వామ్యవాదులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రద్దు, తొలగించిన ఓట్ల పునరుద్ధరణ, ఎన్నికల కమిషనర్ తొలగింపు డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న పోరాటాలకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిల రామయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ఉపాధ్యక్షుడు గుంపల్లి అశోక్, కార్మికులు రాధాకృష్ణ, హుస్సేన్, రాజు, రామస్వామి, వెంకటయ్య, బాలస్వామి, కృష్ణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్డి (బి), హల్దా గ్రామాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ ,అక్టోబర్ 23(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుబీర్ మండలంలోని పార్డి (బి), హల్దా గ్రామాలను శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సందర్శించారు,పార్డి (బి) బస్టాండ్ నుండి గ్రామ పంచాయతి వరకు నడుచుకుంటు రోడ్లు,పరిశుభ్రతను పరిశీలించారు,గ్రామ పంచాయతి లో సర్పంచ్ మడి ప్రవీణ్,మాజీ జడ్పీటీసి సభ్యులు వాన్మేరే మోహన్ లతో జిల్లా కలెక్టర్ మాట్లాడి మీ గ్రామంలోనీ భగీరథ సమస్యలను అడిగి తెలుసుకున్నారు, పెండింగ్ లో ఉన్న మిషన్ భగీరథ పనులపై భగీరథ డీఈ తో మాట్లాడి పార్డి (బి) మిషన్ భగీరథ పనులు ఎందుకు పెండి పెండింగ్ లో ఉన్నాయని ఆరా తీశారు,గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, ఇన్టీమెంట్ కాపీలు పంపితే బడ్జెట్ సాంక్షన్ చేస్తామన్నారు,అనంతం జిల్లా కలెక్టర్ హల్దా గ్రామాన్ని సందర్శించి షిలింగ్ భూములు పరిశీలించారు,గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సర్పంచ్ దేవిందర్ ,కార్యదర్శి లకు కలెక్టర్ ఆదేశించారు,ఆయన వేంట తహసీల్దార్ శ్రీదేవి, ఏం పి డి ఓ.భూమారావు.ఎంపీ ఓ. భీమేష్,ఆర్ ఐ లు శ్రీనివాస్, నరేష్ , తదితర అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..



పుష్కరాల పనుల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం అవసరం

- గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలి

- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు



నిర్మల్ అక్టోబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.నిర్మాణ పనుల పురోగతి వివరాల ను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు.వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు. పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశంచేస్తున్నట్లు తెలిపారు.గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. పరిశీలనలో ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తల్లాడలో కనకదుర్గ అమ్మవార్లను భారీ ఊరేగింపు..

- గురుస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం..

తల్లాడ అక్టోబర్ 23 ప్రజా కలం న్యూస్ దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని తల్లాడలో పస్తం రంగారావు(గురుస్వామి), పస్తం మద్దిరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కరకదుర్గమ్మ అమ్మవార్లను ఊరేగించారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి డప్పు వాయిద్యాలు, మేళ్ల తాళాలు, కోలాట నృత్యాలు నడుము తల్లాడ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వచ్చిన ప్రత్యేక కళాకారులు వివిధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించి తల్లాడ పట్టణ ప్రాంతంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టణవాసులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తిలకించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గ్రామ పెద్దలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజు మల్లవరం బామ్మ కల నెరవేర్చారు

ఖమ్మం అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు.మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులయ్యారు.అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం.మహానేత కేసీఆర్ ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా,ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్,అజయ్ కుమార్,మనవళ్లు యుధిష్టర్,శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు.సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు. త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు.

శ్రీరఘునందన్ ను అభినందించిన కేటీఆర్



సామ్రాజ్యం మనవడు,అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు. ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ,పరిశుభ్రత, పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ.మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17వతేదీన తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు.

అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు, వయస్సు 9 ఏళ్లు.తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు. చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ,2017,18లలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి.ఈ సందర్భంగా శ్రీరఘునందన్,ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ వేదికపై సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు భద్రాచలం బిడ్డ మరో అద్భుత విజయం



ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, అక్టోబర్ 23

గుండె బైపాస్ శస్త్రచికిత్సను అధిగమించి... 73 ఏళ్ల వయసులో ప్రపంచ క్రీడా వేదికపై సత్తా చాటిన అపూర్వ విజేత భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు దేశరాజు వెంకట శంకరరావు తెలంగాణ రాష్ట్రం, భద్రాచలానికి చెందిన విశ్రాంత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి శ్రీ డి.వి. శంకరరావు ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో మరోసారి అసాధారణ ప్రతిభను కనబరిచి భారతదేశ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించారు! అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని నెవాడా రాష్ట్రం, రెనో నగరంలోని ప్రతిష్ఠాత్మక సిల్వర్ లెగసీ బాల్‌రూమ్ వేదికగా, 2026 అక్టోబర్ 22న జరిగిన వరల్డ్ మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మాస్టర్స్-4 74 కిలోల విభాగంలో అద్భుత ప్రతిభను ప్రదర్శించి ప్రపంచ పవర్ లిఫ్టింగ్ వేదికపై రజత కైవసం చేసుకున్నారు! ఇదే వేదికపై అక్టోబర్ 15న జరిగిన వరల్డ్ మాస్టర్స్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో కాంస్య పతకాన్ని సాధించిన ఆయన, కేవలం వారం రోజుల వ్యవధిలోనే మరో మెట్టు పైకెగసి రజత పతకాన్ని అందుకోవడం విశేషం!

క్లాసిక్‌లో కాంస్యం!.. ఎక్విప్డ్‌లో రజతం!

ప్రపంచ వేదికపై భారతీయుడి విజయకేతనం!

ఒకే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండు విభాగాలు... రెండు ప్రపంచ పతకాలు... ఒక అసాధారణ విజయగాథ! మొత్తంగా 10 మెడల్స్. 2012లో గుండె బైపాస్ శస్త్రచికిత్స చేయించుకున్న శ్రీ శంకరరావు గారు, జీవితంలో ఎదురైన ఆరోగ్య సవాళ్లను అధిగమించి, 73 ఏళ్ల వయసులో ప్రపంచస్థాయి క్రీడా పోటీల్లో రెండు పతకాలు సాధించడం నిజంగా స్ఫూర్తిదాయకం! వయసు విజయానికి అడ్డంకి కాదు... ఆరోగ్యపరమైన సవాళ్లు ఆశయాలకు అవరోధాలు కావు... అచంచల ఆత్మవిశ్వాసం, అకుంఠిత దీక్ష, పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సైతం సుసాధ్యం చేయవచ్చని ఆయన నిరూపించారు! ఈ అపూర్వ విజయం కేవలం వ్యక్తిగత ఘనత మాత్రమే కాదు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని కొనసాగించాలని ఆకాంక్షించే లక్షలాది మంది వయోవృద్ధులకు, ఆరోగ్య సమస్యలను అధిగమించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలనుకునే ప్రతి ఒక్కరికీ గొప్ప ప్రేరణ!

రెండు ప్రపంచ పతకాలు – ఒక అసాధారణ స్ఫూర్తి ప్రయాణం!

భారతదేశానికి గర్వకారణం! తెలంగాణ రాష్ట్రానికి గౌరవప్రదం!

భద్రాచలం గడ్డకు మరపురాని ఘనత!

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ వేదికపై భారతదేశానికి రెండు పతకాలు సాధించి, తన సత్తాను చాటిన శ్రీ డి.వి. శంకరరావు గారికి స్టేట్ సెక్రెటరీ జోసెఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి మల్లేష్ , పాకాల దుర్గాప్రసాద్ , జిల్లా అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ జీవీ రామిరెడ్డి, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజి , జాయింట్ సెక్రెటరీ శోభన్ నాయక్, మరియు అన్ని క్రీడా అసోసియేషన్ల బాధ్యులు గ్రీన్ భద్రాద్రి అసోసియేషన్ సభ్యులు, అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు , పట్టణ ప్రముఖులు, వ్యాపార సంఘాలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు, తదితరులు అభినందించడం జరిగింది.

సంయుక్త కిసాన్ మోర్చా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిఇసి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దగ్ధం

నిర్మల్ అక్టోబర్ 23 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదురుగా జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ కే యం నాయకులు, దుర్గం నూతన్ కుమార్, జీ రాజు, ఆర్ రామ లక్ష్మణ్ లు మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు కార్మిక వ్యవసాయ కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిందే కాకుండా చివరికి ఓటు హక్కును కూడా ప్రజలకు దూరం చేస్తుందని.40 ,50 సంవత్సరాలుగా ఓట్లు వేస్తున్న ఓటర్లకు వారి ఓటు నమోదుకు చిన్నచిన్న పొరపాట్లను సాకుగా చూపి ఓట్లను రద్దు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మరణించిన వారి ఓట్లను తొలగించడం నిత్యం



జరుగుతున్న ప్రక్రియ కానీ ఎస్ ఐ ఆర్ పేరిట బిజెపి వ్యతిరేక ఓట్లను రద్దు చేస్తుంది ఆరోపించారు.సీఇసీ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తప్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి అఖిలభారత రైతు కూలి సంఘం రాష్ట్ర,ఉపాధ్యక్షులు. జె.రాజు ,టి యు సి ఐ జిల్లా కార్యదర్శి ఆర్ రామ లక్ష్మణ్ అధ్యక్షులు మద్దెర్ల బక్కన్న ,రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, నాగేల్లి నర్సయ్య గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు క్లెమెంట్ వెస్లీ టి యు సి ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ .గంగన్న,గఫ్ ర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు బర్కుంట గంగారం జిల్లా కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న జిల్లా ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ,రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బి ప్రసాద్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు సుంకరి లక్ష్మి ,గిరిజన సంఘం నాయకురాలు తొడసం సుమిత్ర,పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి పవార్ కిరణ్ కెవిపిఎస్ జిల్లా నాయకులు కుక్కరికారుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు వర్గపోరు

అదిలాబాద్ : తెలంగాణలోని మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత వర్గపోరు ముదిరి, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పండుగ రోజుల్లో చోటుచేసుకున్న వరుస దాడులతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సద్దుల బతుకమ్మ రోజున మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేటలో జరిగిన వివాదం సద్దుమణగక ముందే, దసరా రోజున మరోసారి 2 వర్గాల మధ్య గొడవలు జరిగాయి. ఈ ఘర్షణలకు సంబంధించి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.మరోవైపు కాంగ్రెస్ నేత జగన్ మోహన్ రావు నివాసంపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు వర్గీయులు దాడికి పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యగా జగన్ మోహన్ రావు ఇంటి వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నేతల మధ్య ఉన్న పాత కక్షలు దాడుల వరకు వెళ్లడంతో స్థానికంగా తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది. మంచిర్యాల నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.పరిస్థితి చేయిదాటిపోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో పోలీసుల పహారా కొనసాగుతోంది. ముందస్తు చర్యల్లో భాగంగా మంత్రి వివేక్ వర్గానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ నివాసంలో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు, గిరిజన మహిళా సర్పంచ్ కుర్సింగ కళావతి, ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, మాలమహానాడు నాయకుడు మాడ దయాకర్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

ముత్యాలగూడెం కాటమయ్య గుడి వద్ద విద్యుత్ వెలుగులు!

మంత్రి పొంగులేటి చొరవతో సత్వరమే పనులు పూర్తి - విద్యుత్ అధికారులకు అభినందనలు తెలిపిన గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు.



పాలేరు అక్టోబర్ 23(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల పరిధిలోని శుక్రవారం అయ్యప్ప భక్తుల పూజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముత్యాలగూడెం గ్రామంలోని కాటమయ్య గుడి వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు పనులను సత్వరమే పూర్తి చేసిన విద్యుత్ అధికారులను గ్రామ ప్రజలు అభినందించారు. గుడి వద్ద విద్యుత్ సదుపాయం లేకపోవడంతో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

గుడి వద్ద విద్యుత్ సదుపాయం కల్పించేందుకు సుమారు అర కిలోమీటరు మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వైర్లు లాగి వీధిదీపాలను అమర్చారు. భక్తులకు అవసరమైన సదుపాయాన్ని కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు వేగంగా స్పందించి పనులను పూర్తి చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి పీఏ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి చొరవ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు, చొరవతో పాటు మంత్రి పీఏ తంబూరి దయాకర్ రెడ్డి, పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో విద్యుత్ పనులు వేగంగా పూర్తయ్యాయని గ్రామ ప్రజలు అభిప్రాయపడ్డారు. ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం వల్లే ఈ సదుపాయం త్వరగా అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు.

విద్యుత్ అధికారులకు అభినందనలు

కాటమయ్య గుడి వద్ద విద్యుత్ సదుపాయం కల్పించడంలో చొరవ చూపి, పనులను సత్వరమే పూర్తి చేసిన ఏడీఈ వెంకట్, ఏఈ మహమ్మద్ అక్బరుద్దీన్, జేఎల్ఎం ఎం. శ్యామ్‌లను కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు మంకెన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ పేరెల్లి అశోక్, ఉపసర్పంచ్ పాసిని ప్రభాకర్, అయ్యప్ప భక్తులు, గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. భక్తుల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సదుపాయం కల్పించడం అభినందనీయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సత్వర ఫలితాలు సాధ్యమవుతాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

టి.జి.పి.ఎస్.సి అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ కంప్యూటర్ ఆధారిత(సి.బి.ఆర్.టి) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 23:

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 24, 26 తేదీల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి. జి.పి.ఎస్. సి) కాలుష్య నియంత్రణ మండలిలో తొలిసారిగా అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలను (సి.బి.ఆర్.టి) ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.. రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 640 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే ఈ పరీక్షలకు జయప్రకాష్ ఇంజినీరింగ్ కళాశాల (జేపీఎన్‌సీఈ)ధర్మాపూర్,లో,,మహబూబ్ నగర్ పట్టణ క్రిష్టియన్ పల్లి లో ఎంఎస్ ఏస్ ఇన్ఫోటెక్ ఫాతిమా విద్యాలయంలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలను, అభ్యర్థులకు రవాణా పరంగా ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షల నిబంధనలను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

మొబైల్ ఫోన్ లు,ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించ రాదు

అభ్యర్థులను నిబంధనల ప్రకారం తనిఖీ చేసిన అనంతరమే కేంద్రాల్లోకి అనుమతించాలని, మొబైల్ ఫోన్లు, ఇతర నిషేధిత ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి అనుమతించరాదన్నారు. పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.



పరీక్షల సమయాలు.. అభ్యర్థులకు సూచనలు

అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II పరీక్ష ఉదయం సెషన్ లో,,.. అక్టోబర్ 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ఉదయం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారు. మధ్యాహ్నం సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులను మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు అనుమతిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేయగా, పరీక్ష 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. నిర్ణీత సమయానికి గేట్లు మూసివేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లలో పేర్కొన్న పరీక్షా కేంద్రాలను ముందుగానే నిర్ధారించుకుని, నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్, ఎస్పీ

కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్.బి. హరిప్రియ, జిల్లా ఎస్పీ డి.జానకి శుక్రవారం జయప్రకాష్ ఇంజినీరింగ్ కళాశాల,పాతిమా విద్యాలయ పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సాంకేతిక సదుపాయాలు, మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిస్తారా? బీజేపీని వ్యతిరేకిస్తారా?

విజయవాడ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు మద్దతివ్వడంపై వ్యతిరేక వ్యాఖ్యలు చేస్తున్నారు. అలాగే కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులకు బహిరంగ మద్దతు తెలపడం జాతీయ రాజకీయాల్లో సరికొత్త రగడను రాజేసింది. గతంలో పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు ఇచ్చి తప్పు చేశానని, చట్ట సవరణల విషయంలో పరోక్షంగా పశ్చాత్తాపపడిన జగన్, ఇప్పుడు నిజంగానే ఆచరణాత్మక వ్యతిరేకతను ప్రదర్శిస్తారా అనే చర్చ తీవ్రమవుతోంది. ఈ నెల చివర్లో లేదా రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో మోదీ ప్రభుత్వం అత్యంత కీలకమైన డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోందనే ప్రచారంతో జగన్ తీసుకోబోయే స్టాండ్ ఆయన రాజకీయ భవిష్యత్తుకు కొలమానంగా మారనుంది. వైఎస్సార్‌సీపీకి ప్రస్తుతం లోక్‌సభ మ, రాజ్యసభల్లో ఉన్న సభ్యుల సంఖ్య స్వల్పమే అయినప్పటికీ, రాజ్యసభలో సంకీర్ణ సమీకరణాలు , విపక్షాల ఐక్యతను చాటడంలో ఆ కొద్దిమంది ఎంపీల ఓట్లు కూడా అత్యంత కీలకం కానున్నాయి. గత ఐదేళ్ల పాటు నల్లచట్టాలు, కీలకమైన బిల్లులు, డిప్యూటీ స్పీకర్ ఎన్నికల వరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మక మద్దతు ఇస్తూ వచ్చింది. అయితే, ఏపీలో 2024 ఎన్నికల ఓటమి తర్వాత, టీడీపీ-జనసేనలతో బీజేపీ జట్టుకట్టడంతో జగన్ ఒంటరి అయ్యారు. ఇప్పుడు కేంద్రానికి మద్దతిచ్చి తప్పు చేశానా? అనే ఆలోచనలో ఉన్న జగన్, రాబోయే డీలిమిటేషన్ చట్టసభల బిల్లు విషయంలో ధైర్యంగా వ్యతిరేక ఓటు వేయగలరా అన్నదే అసలైన ప్రశ్నగా మారింది. ఈ విమర్శలు, సవాళ్ల మధ్య వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ మాత్రం డీలిమిటేషన్ , మహిళా బిల్లులకు సూత్రప్రాయంగా మద్దతు ఇస్తామని ఇప్పటికే కొన్ని వేదికలపై సూచనలు ఇచ్చింది. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనలు దేశాభివృద్ధికి, దశాబ్దాల కల నెరవేర్చడానికి అవసరమైన ప్రాథమిక సంస్కరణలు అనే వ్యాఖ్యలతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు సమర్థించుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయంగా బీజేపీకి వ్యతిరేకమని చెప్తూనే, ఇటువంటి ప్రజామోదయోగ్యమైన బిల్లులను రాజకీయాలకు అతీతంగా దేశ ప్రయోజనాల కోసం మద్దతిస్తున్నాం అని జగన్ ప్రకటిస్తే, అది మళ్లీ ఆయన్ను పాత పరోక్ష మద్దతు వైఖరిలోనే నిలబెడుతుంది. ఇక్కడే జగన్ మోహన్ రెడ్డి విశ్వసనీయతపై ప్రత్యర్థుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఢిల్లీ వీధుల్లో బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలిపే ప్రొటెస్ట్ గ్రూపులకు, ఈసీ వ్యతిరేక ఉద్యమాలకు ట్విట్టర్ వేదికగా బాహాట మద్దతు ఇవ్వడం, మరోవైపు పార్లమెంట్



భవనంలోకి వచ్చేసరికి అదే బీజేపీ తీసుకొచ్చే రాజ్యాంగ సవరణ బిల్లులకు అనుకూలంగా ఓటు వేయడం ద్విముఖ వైఖరిని ఎండగడుతోంది. గతంలో తప్పు చేశానని జనం ముందు చెప్పడం, తీరా నిర్ణయాత్మక ఘట్టం వచ్చేసరికి మళ్లీ అదే తప్పును పునరావృతం చేయడం జగన్ రాజకీయ అనిశ్చితికి నిదర్శనం అని ప్రతిపక్షాలు ఎద్దేవా చేసే అవకాశం ఉంది. మరో కోణంలో చూస్తే, జగన్ ముందు రెండు స్పష్టమైన మార్గాలు మాత్రమే మిగిలాయి. మొదటిది.. తాము విధానపరంగా బీజేపీతో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నామని నిరూపించుకోవడానికి ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కీలక బిల్లును సూటిగా వ్యతిరేకించడం, తద్వారా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి లేదా ఇతర తటస్థ విపక్షాల సరసన నిలవడం. రెండోది.. జాతీయ అంశాలు వేరు, ప్రాంతీయ రాజకీయాలు వేరు అని చెప్తూ, భవిష్యత్తులో కేసుల ఒత్తిడి , కేంద్ర యంత్రాంగం నుంచి ఉపశమనం కోసం బిల్లులకు మద్దతు నిరంతరం కొనసాగించడం. కానీ, రెండో మార్గాన్ని ఎంచుకుంటే మాత్రం మళ్లీ తప్పు చేశానని భవిష్యత్తులో చింతించాల్సి వస్తుందనే విమర్శలను ఆయన తప్పించుకోలేరు. బిల్లులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నైతిక రాజకీయాలకు, సిద్ధాంతపరమైన స్టాండ్‌కు అసలైన అగ్నిపరీక్షగా మారనున్నాయి. మాటల్లో బీజేపీ వైఖరిని, ఎన్నికల వ్యవస్థను తప్పుబడుతున్న జగన్, చేతల్లో పార్లమెంట్ వేదికగా ఓటింగ్ సమయానికి ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ నిర్ణయమే రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ జాతీయ స్థాయి రాజకీయ భవిష్యత్తును, మిత్రులెవరో శత్రువులెవరో తేల్చే కీలక ఘట్టం కానుంది.

వంతెనలు పూర్తయ్యేదెన్నడు..?

ఆసిఫాబాద్ : దశా బ్దాలు గడుస్తున్నా జిల్లాలో ప్రధాన వంతెన నిర్మాణల పనులు పూర్తి కావడం లేదు. దీంతో ప్రతి ఎడాది వర్షాకాలంలో మారు మూల గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. భౌగోళికంగా భిన్నమైన స్వరూపం కలిగిన ఆసిఫాబాద్ జిల్లా ఏజెన్సీలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలకు ప్రత్యక్ష నరకమే. గూడాల నుంచి ప్రధాన పట్టణాలకు రావాలంటే భగీరథ ప్రయత్నం చేయాల్సిందే. జిల్లాలోని 334పైగా ఆవాసాలకు నేటికీ అసలు రహదారి సౌకర్యమే లేదంటే ఉన్న గ్రామాలకు వాగులు, వంకల రూపంలో వర్షాకాలమంతా అష్టదిగ్బంధనమే. ఇటు ఆసిఫాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు ఏజెన్సీ మండలాలతో పాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, పెంచికలపేట, కాగజ్‌నగర్ వరకు అన్ని మండలాల్లో ప్రజలు ఒకే రకమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న చిన్న వాగులు మొదలుకుని ఎర్రవాగు, పెద్దవాగు, ప్రాణహిత పరివాహక ప్రాంతంలోని వంకలపై నేటికి వంతెనలు లేక పోవడంతో ప్రజానీకం బయట ప్రపంచానికి చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. జిల్లాలో ఇలా చిన్న చితక కల్వర్టు మొదలుకుని భారీ వంతెనల వరకు ఏవీ పూర్తి కాక పోవడంతో ప్రజానీకానికి ఇక్కట్లు తప్పడం లేదు. పనులను వేగిరం చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో నిర్మాణల పనులు నిలిచిపోయాయని వివిధ మండలాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు.

ఏళ్లుగా కొనసా... గుతున్న వంతెనల నిర్మాణాలు :

గ్రామాలకు రవాణా కష్టం తీర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి పూర్తిస్థాయిలో చేరడం లేదు. మారుమూల గ్రామాల ప్రజలు ఇప్పటికి కష్టాలు పడుతున్నారు. కాలంతో కుస్తీ పడుతూ సమస్యల సుడి గుండంలో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అయా మండలాల్లోని గ్రామాలలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు దశాబ్దలుగా కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసిఫాబాద్ మండ లంలోని పెద్దవాగుపై గుండి వంతెన నిర్మాణ పనులు దశాబ్దన్నర కాలం పాటు కొనసాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుండి గ్రామానికి వర్షాకాలంలో వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కెరమెరి మండలంలోని అనార్‌పల్లి, లక్మాపూర్ వంతెన నిర్మాణపనులు అసంపూర్తిగా ఉండడం వల్ల 12 గ్రామాల ప్రజలకు ప్రతి వర్షాకా లంలో రాక పోకలు నిలిచి పోతాయి. దీంతో అయా గ్రామాల ప్రజలు వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

పత్తి కొనుగోలుకు సన్నద్ధత

నవంబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం - ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్ : జిల్లాలో 2026-27 సీజన్ పత్తి కొనుగోళ్లకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలో ఈ సారి అదిక విస్తీర్ణంలో తెల్ల బంగారం సాగు కాగా ఇప్పుడిప్పుడే దిగుబడులు చేతికందుతున్నాయి. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పత్తికొనుగోళ్ల కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధం అయ్యారు. నవంబరు మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. పత్తి సేకరణ కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. జిల్లాలో పత్తి కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్‌లు వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ, ఫైర్, ఆర్టీఏ, తునికలు, కొలతల శాఖల అధికారుల తో పాటు జిన్నింగ్ మిల్లుల యాజమానులతో ప్రత్యేక సమా వేశాన్ని నిర్వహించి కొనుగోళ్లను పకడ్బందిగా నిర్వహించాలని అదేశించారు. రైతు లకు ఇబ్బందులు తలెత్తకుండ ముందు జాగ్రత్త చర్యలు తీసుకొవాలని సూచించారు. జిన్నింగ్ మిల్లులలో ఎలక్ట్రానిక్ కంటాలు, కంప్యూటర్లు, ప్రింటర్లు వే బిల్లులతో పాటు అందుకు సంబందించిన సాఫ్ట్‌వేర్‌ను సిద్దం చేసుకొవాలని ఆదేశించారు.

మూడు మార్కెట్ కమిటీల పరిధిలో..జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీల పరిధిలలో 24 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి.అయా జిన్నింగ్ మిల్లులలో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.8,667 మద్దతు ధర ప్రకటించింది. జిన్నింగ్ మిల్లులలోనే కొనుగోలు కేంద్రాలుగా గుర్తించడంతో ఏటా సీసీఐ సైతం జిన్నింగ్ మిల్లులలోనే పత్తి



కొనుగోళ్లను చేపడుతుంది. ప్రైవేటులో కొనుగోళ్లు ప్రారంభమైతే వ్యాపారుల్లో పోటి పెరిగి రైతులకు మద్దతు ధర లబించే ఆవకాశం ఉంది. ప్రభుత్వ మద్దతు ధర తక్కువగా ఉండటంతో ఈ ఏడాది రైతులు ప్రైవేటు మార్కెట్‌లోనే పత్తిని విక్రయించేందుకు మొగ్గు చూపు తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలుకు రూ. 9,200 నుంచి 9,500 వరకు ధర పలుకుతున్నది.

3.77 లక్షల ఎకరాల్లో..జిల్లాలో ఈ ఏడాది 4.6 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో రైతులు వివిధ పంటలు సాగు చేయగా వీటిలో 3.77 లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాది ప్రైవేటు మార్కెట్‌లో కంటే సీసీఐ మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో రైతులు సీసీఐకే పత్తిని విక్రయించారు. ఈ ఏడాది ప్రభుత్వ మద్దతు ధర రూ. 8,667 ఉండడం బహిరంగ మార్కెట్‌లో పత్తికి మద్దతు ధర ఆధికంగా ఉండటంతో ప్రైవేటులోనే విక్రయించేందుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.. జిల్లాలోఈ ఏడాది 26.44 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చేబుతున్నారు.

జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా?

పులివెందుల : స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న ఘటనలు చూస్తుంటే టీడీపీ, వైసీపీలు రెండూ ఒకే బాట పయనిస్తున్నాయి. అరాచకాలలో ఒకరిని మించి మరొకరు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ పాలనపై విమర్శలు చేసే చంద్రబాబు నేడు జరుగుతున్న పరిస్థితులను అవతలి వారిపైకి నెట్టడం సమర్థనీయం కాదు. ఎన్నికలంటే శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదు. ఇప్పుడు జరుగుతున్న, జరిగిన పరిణామాలకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా చేష్టలుడిగి చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఇంత ఉదాసీన వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్ లో ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఇవే పరిస్థితులు తలెత్తక మానవన్న కామెంట్స్ రాజకీయ విశ్లేషకులు కూడా చేస్తున్నారు.రాజకీయాలు చూడండి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం అధికార పార్టీది, విపక్ష పార్టీది ఒకే దారి అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఇప్పుడు వైసీపీ బాధిత పార్టీగా కనిపించవచ్చు. కానీ అదే తమ పాలనలో జగన్ ప్రభుత్వం అవలంబించిన చర్యలేవిటి? అని చంద్రబాబు ప్రశ్న కూడా అందరూ ఆలోచించాల్సిన విషయమే. అలాగే ఇదే విమర్శ రేపు చంద్రబాబు కూడా ఎదుర్కొనే పరిస్థితులు రావచ్చు. నాడు కుప్పం నియోజకవర్గంలో జగన్ చేసిన పని, నేడు పులివెందులలో టీడీపీ చేసింది. ఇందులో తప్పు వెతుక్కోవడానికి ఇద్దరిలోనూ వెతికినా కనిపించవు. కానీ జనం మాత్రం వీటిని గమనిస్తూనే ఉంటారన్న విషయాన్ని మాత్రం వైసీపీ, టీడీపీలు మర్చి పోకూడదు. ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించాలంటే రెండు పార్టీల అధినేతలు ఎవరికి వారే ఆత్మవిమర్శలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికలను టీడీపీ, వైసీపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కూటమి పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలుపు సాధించుకోవాలని సహజంగానే భావిస్తుంది. అదే సమయంలో వైసీపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత బలోపేతం అయితే రానున్న సాధారణ ఎన్నికలకు పుంజుకుంటామని భావన కారణంగానే ఈ రకమైన పరిస్థితులు ఏర్పడ్డాయన్నది కాదనలేని వాస్తవం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అందులో తప్పులేదు. కానీ హింసా రాజకీయాలకు స్వస్తి పలకాలి. అనుభవమున్నచంద్రబాబు కు ఇది ఎంత మాత్రం అభిలషణీయం కాదు. ఒకరకంగా జగన్ వేసిన ట్రాప్ లో చంద్రబాబు చిక్కుకున్నారా? అన్న అనుమానం కూడా చాలా మంది సీనియర్ నేతల్లో వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ నామినేషన్ల సందర్భంగానే చూశాం. ఇక జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికల్లో ఇంకెంత రగడ చూడాలో.. .దేవుడా ఏపీకి నీవే దిక్కు. అని అనుకోవడం తప్ప చేసేదేమీ లేదు

వ్యూహాలు ప్రతివ్యూహాలతో

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాచికలు పారినట్లు కనపడుతుందివైఎస్ మోహన్ రెడ్డి వ్యూహాలు ప్రతివ్యూహాలతో సర్వసన్నద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంది. దీంతో తాడిపత్రి మున్సిపాలిటీ తప్పించి అన్నింటా వైసీపీ విజయం సాధించింది. అయితే ఇప్పుడు టీడీపీ పాలనపై వ్యతిరేకత తెచ్చేందుకు, తమ పార్టీపై సానుభూతి కురిసేందుకు జగన్ వేసిన వ్యూహం సక్సెస్ అయినట్లే కనపడుతుంది. ప్రతి చోట ఖచ్చితంగా నామినేషన్లు వేయాలని, ఏకగ్రీవం జరిగితే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇవ్వనని జగన్ నాడు చేసిన హెచ్చరికలను వేరే విధంగా చూసిన వారికి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతుంది. జగన్ తన ఎత్తుగడలో భాగంగనే నామినేషన్లు వేయించి అభ్యర్థులను బరిలోకి దిగితే శాంతిభద్రతలు అదుపు తప్పి టీడీపీ పాలనపై వ్యతిరేకత ఏర్పడుతుందని అంచనా నిజమవుతుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న నామినేషన్ల పర్వం చూస్తేనే ఇది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.మ్యాప్‌లు చూడండి ప్రతి సీటులోనూ పోటీకి... గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా, ఈసారి ప్రతి స్థానంలోనూ వైసీపీ అభ్యర్థిని పోటీకి నిలపాలని జగన్ పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడా అధికార కూటమికి ఏకగ్రీవాలు చేసుకునే అవకాశం ఇవ్వకూడదని, ఒకవేళ ఏదైనా నియోజకవర్గంలో ఏకగ్రీవమైతే దానికి స్థానిక నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు పూర్తయి ఏ పార్టీ ఎక్కడ పోటీ చేయాలో అధికారికంగా ప్రకటించినప్పటికీ... వైఎస్ జగన్ మాత్రం ఒక అడుగు ముందే వేసి మొదటి విడతగా 27 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కూడా విడుదల చేశారు. గ్రౌండ్ రిపోర్టుల ఆధారంగా ప్రజాదరణ కలిగిన బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తూ కొత్త ఎత్తుగడలతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సమాచారం చూడండి.. ఎన్నికల సమయంలో అధికార యంత్రాంగం లేదా పోలీస్ వ్యవస్థల నుంచి ఎదురయ్యే ఒత్తిళ్లను, అక్రమాలను తట్టుకునేందుకు వీలుగా నియోజకవర్గాల వారీగా ప్రత్యేక లీగల్ సెల్స్, మీడియా సెల్స్‌ను ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో ఏవైనా అధికార దుర్వినియోగ ఘటనలు జరిగితే వాటిని రికార్డ్ చేయడానికి 'డిజిటల్ డైరీ' విధానాన్ని తీసుకువచ్చారు.ఈ స్థానిక ఎన్నికలను కేవలం ఒక పోటీలా కాకుండా, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని గ్రామ స్థాయి నుండి తిరిగి బలోపేతం చేసుకునే ఒక ప్రక్రియగా జగన్ భావిస్తున్నారు. అందుకోసం రీజనల్ కో-ఆర్డినేటర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ ఆగడాలు చూసి క్యాడర్ లోనూ కసి పెరుగుతుందని, అది తమకు వచ్చే సాధారణ ఎన్నికల్లో అనుకూలంగా మారుతుందని జగన్ అంచనా వేశారు. అనుకున్నట్లుగానే క్యాడర్ ఏకతాటిపైకి రావడంతో జగన్ పాచిక పారినట్లయింది. అధికార కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుని పటిష్టంగా ఉన్న నేపథ్యంలో, జగన్ ముందస్తు వ్యూహాలు మరియు ఒంటరి పోరాటం క్షేత్రస్థాయిలో ఎంతవరకు ఓటర్లను ఆకర్షిస్తాయనే దానిపైనే ఆయన "పాచిక" సక్సెస్ ఆధారపడి ఉంటుంది. నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటే అది తమకు కలసి వస్తుందని అంచనా వేస్తున్నారు జగన్.

ప్రపంచంలో రైట్ వింగ్ ప్రెసిడెంట్స్ అందరికీ ప్రజలు వ్యతిరేకం !



ఈ రోజున ప్రపంచంలో అంతటా పెద్ద ఎత్తున అధికారంలో ఉన్న వారి మీద ప్రజలు తిరగబడుతున్నారు. వీధుల్లోకి వచ్చి మరీ అన్నీ తగలబెడుతున్నారు. వారి విధానాల పట్ల కన్నెర్ర చేస్తున్నారు. మీ సిద్ధాంతాలకు మేము పూర్తిగా ప్రతికూలం అంటూ రాద్ధాంతం చేస్తున్నారు. ఎటు చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లుగా విశ్వం సమస్తం మొత్తం జనం ధర్మాగ్రహంగా పరిస్థితి కనిపిస్తోంది. గద్దెనెక్కిన ఏలికల పాలన నచ్చడం లేదు, అందుకే ఏకి పారేస్తున్నారు. సాదా సీదా జనమే అనుకుంటే ఏకు మేకు అవుతున్నారు. అధికారాన్ని డేరింగ్ అండ్ డేషింగ్ గా ఎదురొడ్డుతున్నారు. జనమంతా కూడి బలమైన కోటలనే కూల్చేస్తున్నారు. అంతర్జాతీయంగా చూస్తే ఇదీ కళ్లకు కనిపిస్తున్న పరిస్థితి. ఇది దుస్థితినా లేక దుర్నీతి మీద సాగుతున్న పోరునా అన్నది అయితే పక్కన పెడితే జనాలు మాత్రం సహించేది లేదు, భరించేది లేదని అంటున్నారు. మీ చేతగాని పాలన చాలు అని చెక్ చెప్పేస్తున్నారు.

ట్రంప్ నుంచి మొదలెడితే : ఈ రోజున అగ్రరాజ్యంగా ఉన్న అమెరికాలోనే జనాల అసంతృప్తి తీవ్ర స్థాయిలో ఉంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీద పీకల దాకా కోపం అయితే ప్రజలలో ఉంది అని అంటున్నారు ఆయన రెండేళ్ల ప్రెసిడెంట్ గిరీ పూర్తి చేసుకున్న వేళ ఇంకా సగమే పూర్తి అయిందా అని జనాలు భారంగా వేడి నిట్టూర్పులు విడుస్తున్నారు అంటే ట్రంప్ కి జనం రెడ్ సిగ్నల్ చూపిస్తున్నట్లుగానే విశ్లేషణలు ఉన్నాయి. అమెరికా ట్రంప్ కి ప్రజల నుంచి ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత ఎలా వచ్చింది అంటే ఆయన యుద్ధ పిపాసి కావడం వల్లనే అంటున్నారు. లేని పోని యుద్ధాలు తెచ్చి అమెరికాను సర్వనాశనం చేశారు అన్నది మెజారిటీ జనం భావనగా ఉంది మరి. ట్రంప్ అమలు చేస్తున్న విధానాల పట్ల ప్రజలు మండిపోతున్నారు. అంతే కాదు దేశం మొత్తం అభద్రతాభావానికి వెళ్ళిపోయింది అన్నది గట్టిగా వినిపిస్తున్న మాట.

ఫ్రాన్స్ లో మంటలు : ఇదిలా ఉంటే ఫ్రాన్స్ లో మంటలు చెలరేగుతున్నాయి. అక్కడ జనాగ్రహానికి కారణం జీవన వ్యయం పెరుగుదలతో పాటు ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు విద్యార్థులు పెద్ద ఎత్తున చేపట్టిన నిరసనలు ఇపుడు తీవ్ర హింసాత్మకంగా మారాయి. పెరుగుతున్న ఇంధన ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలపై ప్రజల్లో వ్యక్తమవుతున్న తీవ్ర అసంతృప్తి ఈ స్థాయి అల్లర్లకు కారణమైంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి రావడంతో పాటు పలు నగరాలలో జరుగుతున్న విధ్వంశానికి భారీగా మంటలు చెలరేగుతున్నాయి. అనేక నగరాలలో అల్లర్లు పెచ్చుమీరాయి. దీంతో రాజధాని పారిస్‌తో పాటు లిమోజెస్, లియోన్, మార్సేల్, బోర్డో వంటి ప్రముఖ నగరాల్లో నిరసనకారులు వాహనాలకు ప్రభుత్వ భవనాలకు ఏకంగా నిప్పు పెట్టేశారు. ఈ మంటలలో లిమోజెస్ సిటీలోని చారిత్రక టౌన్ హాల్ తగలబడిపోయింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు వేలల్లోనే నిరసనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో ఫ్రాన్స్ ప్రభుత్వం పారిస్ సహా పలు నగరాల్లో రాత్రి వేళ పాక్షిక కర్ఫ్యూలను విధించింది.

యూకేలో పాలకుల మార్పు : ఇక యూకేలో చూస్తే పాలనాపరమైన అస్థిరత వెంటాడుతోంది. ఎవరు అధికారం చేపట్టినా పూర్తి కాలం పదవిలో కొనసాగలేకపోతున్నారు. గత పదేళ్ల కాలంలో అనేక మంది ప్రధానులు మారిపోయారు. 2016 నుంచి ఇప్పటిదాకా ఏడుగురు ప్రధానులు బాధ్యతలు చేపట్టారు అంటే సగటున ప్రతీ పదిహేను నెలలకూ ఒక ప్రధాని మారిపోతున్నారు అన్న మాట. ఇందులో కేవలం 49 రోజులు ప్రధానిగా లిజ్ ట్రస్ రికార్డు క్రియేట్ చేశారు. యునైటెడ్ కింగ్ డం పాలకుల తీరు పట్ల జనంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉంది. బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం ఇంధన ధరల పెరుగుదల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో సాధారణ ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడింది. ప్రభుత్వం తీసుకుంటున్న కఠినమైన ఆర్థిక నిర్ణయాలు ప్రజా వ్యతిరేకతకు దారితీస్తున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి.

సౌదీ పశ్చిమాసియాలోనూ : ఇక సౌదీ అరేబియా పశ్చిమాసియాలో అయితే ఘర్షణలతో అంతటా వేడెక్కిపోతోంది. అమెరికా మద్దతుతో సాగుతున్న యుద్ధాలతో అంతటా మారణహోమం సాగుతోంది. అక్కడంతా సర్వ నాశనం అవుతున్న పరిస్థితి ఉంది. ప్రజలు అయితే ఎవరూ సాధారణ జీవితాన్ని గడపడం లేదు. చావు బతుకుల మధ్యన వారు ఊగిసలాడుతున్నారు. యుద్ధంలోనే మునిగితేలుతున్న నేపథ్యం ఉంది. దీనికి అమెరికా ప్రధాన కారణం అన్న భావన సర్వత్రా ఉంది. ఆ దేశ విధానాలతో పశ్చిమాసియా మండిపోతోంది అన్నది అంతర్జాతీయంగా ఉన్న విశ్లేషణ. ఇండియాలో సైతం : ఇక చూస్తే ఇండియాలో సైతం ఆందోళనలు చెలరేగుతున్నాయి. సీజేపీ పేరుతో గత కొద్ది నెలలుగా ఢిల్లీ వేదికగా సాగుతున్న నిరసనలు పాలక పక్షానికి కునుకు తీయనీయడం లేదు. ఏకంగా ఒక కేంద్ర మంత్రి రాజీనామా చేశారు అంటే అది ఎన్డీయే సర్కార్ బలమైన కోటకు బీటలు వార్చింది అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇలా చూస్తే రైట్ వింగ్ పాలకులకు అధినేతలకు ఇవి పూర్తిగా గడ్డు రోజులుగా పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే యూరప్ లో చాలా చోట్ల రైట్ వింగ్ ఫిలాసఫీతో సాగుతున్న పాలకులకు ఉద్యమాలతో లెఫ్ట్ సిగ్నల్స్ పడుతున్నాయి. ప్రజల కోసం కాకుండా తాము నమ్ముకున్న సిద్ధాంతాల మీద మమకారంతో అధికారం

నవంబర్ 1 నుంచి కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్

న్యూఢిల్లీ : భారత్‌లో మొబైల్ వినియోగదారులకు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం మరింత సులభం కానుంది. 2026 నవంబర్ 1 నుంచి మొబైల్ ఫోన్లలో కాల్ చేసే వ్యక్తి పేరు కనిపించేలా కాలింగ్ నేమ్ ప్రెజెంటేషన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు అందించిన సమాచారం వెల్లడిస్తోంది. ఈ విధానం ద్వారా ఫోన్ నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. దీంతో వినియోగదారులు గుర్తు తెలియని కాల్స్‌ను సులభంగా గుర్తించడంతో పాటు, మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఫోన్‌కు కాల్ వచ్చినప్పుడు సాధారణంగా ఫోన్ నంబర్ మాత్రమే కనిపిస్తుంది. ఆ నంబర్‌ను మనం కాంటాక్ట్స్‌లో సేవ్ చేసుకుంటేనే మనం పెట్టుకున్న పేరు కనిపిస్తుంది. అయితే కొత్తగా అమలు చేయనున్న అఔంఖ విధానంలో టెలికాం ఆపరేటర్ల వద్ద నమోదైన చందాదారుల వివరాల ఆధారంగా కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా కనిపిస్తుంది.ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ విభాగం టెలికాం సేవల సంస్థలను ఆదేశించినట్లు సమాచారం. తొలుత 4ఉ, 5ఉ వంటి నెట్‌వర్క్‌లలో ఈ సేవను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2ఉ, 3ఉ నెట్‌వర్క్‌లు, ల్యాండ్‌లైన్ కనెక్షన్లకు సంబంధించి అమలు విధానాన్ని ప్రత్యేకంగా పరిశీలించనున్నారు.అఔంఖ విధానంలో ఫోన్‌కు ఇన్‌కమింగ్ కాల్ వచ్చినప్పుడు నంబర్‌తో పాటు కాల్ చేస్తున్న వ్యక్తి పేరు కూడా స్క్రీన్‌పై కనిపిస్తుంది. ఈ ప్రక్రియలో కొన్ని అంశాలను తెలుసుకోవాలి.

కాంటాక్ట్స్‌లో నంబర్ ఉంటే: ఫోన్‌లో ఇప్పటికే సేవ్ చేసుకున్న పేరు కనిపిస్తుంది.నంబర్ సేవ్ చేయకపోతే: టెలికాం ఆపరేటర్ వద్ద నమోదైన చందాదారుడి పేరు కనిపిస్తుంది.విదేశాల నుంచి వచ్చే కాల్స్: స్క్రీన్‌పై అని కనిపిస్తుంది. ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి ప్రతి టెలికాం సంస్థ తన వినియోగదారుల పేర్లు, ఫోన్ నంబర్లకు సంబంధించిన డేటాబేస్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. కాల్ అందుకునే వ్యక్తి ఉపయోగిస్తున్న టెలికాం సంస్థ అవసరమైన వివరాలను సంబంధిత డేటాబేస్ నుంచి సేకరించి స్క్రీన్‌పై ప్రదర్శిస్తుంది.కొత్త వ్యవస్థలో వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతకు కూడా ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం. కాల్ సమయంలో పేరు తెలుసుకునేందుకు ఉపయోగించే సమాచారాన్ని కాల్ ముగిసిన తర్వాత నిల్వ చేయకూడదనే నిబంధనను అమలు చేయనున్నారు. అలాగే, కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ రిస్ట్రిక్షన్) సేవను ఉపయోగిస్తూ తమ నంబర్ వివరాలను ఇతరులకు కనిపించకుండా చేసుకున్న చందాదారులకు ఈ వ్యవస్థ నుంచి మినహాయింపు ఉంటుంది. అలాంటి వినియోగదారుల పేర్లు ద్వారా ప్రదర్శించరు.వ్యాపార సంస్థలు, బల్క్ కనెక్షన్ల వినియోగదారులకు టెలికాం సంస్థల వద్ద నమోదైన పేరుకు బదులుగా వేరే వ్యాపార పేరును ప్రదర్శించుకునే అవకాశం కల్పించవచ్చు. అయితే, ఆ పేరుకు సంబంధించి రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్ లేదా వస్తు సేవల పన్ను పోర్టల్‌లో నమోదైన వ్యాపార పేరు వంటి ఆధారాలు ఉండాలి. వ్యాపార సంస్థలు కోరుకున్న పేరును ప్రదర్శించే ముందు సంబంధిత టెలికాం ఆపరేటర్లు ఆ పేరును, దానికి సంబంధించిన పత్రాలను పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పటికే నమోదైన వ్యాపార పేరును మార్చుకోవాలనుకునే వారు తమ టెలికాం సేవల సంస్థకు అభ్యర్థన సమర్పించాలి.

గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను గుర్తించడం, మోసపూరిత కాల్స్‌ను ఎదుర్కోవడంలో వినియోగదారులకు సహాయపడటం ఈ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం. ఫోన్‌లో సేవ్ చేసుకున్న పేర్లపై ఆధారపడకుండా, టెలికాం సంస్థల వద్ద నమోదైన వివరాల ఆధారంగా కాలర్‌ను గుర్తించే అవకాశం కలుగుతుంది.ఈ విధానానికి సంబంధించి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ 2024 ఫిబ్రవరిలో సిఫార్సులు చేసింది. ప్రతిపాదనకు ట్రాయ్ అంగీకరించినట్లు అందించిన సమాచారం పేర్కొంటోంది.

రాజేంద్రనగర్‌లో డ్రగ్స్, ఆయుధాలు స్వాధీనం

రూ.4 లక్షల విలువైన మత్తు పదార్థాలు, తుపాకులు పట్టివేత ఒకరి అరెస్ట్
నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్, అక్టోబర్ 23, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తాపూర్ సిఖ్ చౌల్ ప్రాంతంలో ఎక్సైజ్ శాఖ అధికారులు భారీ దాడి నిర్వహించారు. ఈ దాడిలో సుమారు రూ.4 లక్షల విలువైన మత్తు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకుని సర్దార్ రాజా సింగ్ (39)



అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.

నిందితుడి నివాసంలో తనిఖీలు నిర్వహించగా 1.5 కిలోల ఎండు గంజాయి, 1.13 కిలోల పోపీ స్ట్రాతో పాటు ఒక రివాల్వర్, రెండు పిస్టల్స్, ఐదు బుల్లెట్లు లభించాయి.నిందితుడు లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ, ఆ ముసుగులో మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. గంజాయి, పోపీ స్ట్రాను ఎక్కడి నుంచి తీసుకొచ్చాడు, ఆయుధాలు అతనికి ఎలా లభించాయనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.ఈ దాడిలో ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొనగా, నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.

ఖాకీ వెనుక ఎన్నో సేవలు!

- అమరుల త్యాగాలు స్ఫూర్తిదాయక.

- విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన.
- ఓపెన్ హౌస్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రదర్శన.



రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 23 (ప్రజా కలం ప్రతినిధి) :

విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో విద్యార్థినీ, విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను విద్యార్థులకు వివరించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియ, బాధితులకు న్యాయం అందించేందుకు చేపట్టే చర్యలను విద్యార్థులకు వివరించారు.

ఆధునిక సాంకేతికతతో నేరాలకు చెక్...

నేరస్తులను గుర్తించేందుకు వినియోగించే ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, పోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ పరికరాల పనితీరును ప్రదర్శించారు. నేరాల నివారణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల ప్రాధాన్యాన్ని వివరించారు. పోలీసులు నిర్వహించే పగలు, రాత్రి బీట్స్, పెట్రోలింగ్ విధానాల గురించి అవగాహన కల్పించారు.

మహిళల రక్షణకు భరోసా...

మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను వివరించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి, బ్లాక్ చేసి తిరిగి పొందేందుకు ఉపయోగించే సీఈఐఆర్ వ్యవస్థ గురించి తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్ విధులు, పేలుడు పదార్థాలను గుర్తించడం, నిర్వీర్యం చేసే విధానం, పోలీసు జాగిలాల సేవలను వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐటీ కోర్, భరోసా కేంద్రం, షీ టీమ్స్, ఫింగర్‌ప్రింట్స్, బాంబ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ విభాగాల సిబ్బంది వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గణేష్, అనిల్, రంజిత్, ఆర్ఎస్ఐ సాయికిరణ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో అలయ్ బలయ్
ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

పార్టీలకు అతీతంగా ప్రజలంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గజ్వేల్, అక్టోబర్ 23 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గజ్వేల్ అలయ్ బలయ్ దసరా ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా



గజ్వేల్ అలయ్ బలయ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీ ఆదివారం తూప్రాన్ రోడ్డులోని టి. లక్ష్మణ్ గార్డెన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు అలయ్ బలయ్ దసరా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కులమతాలకు,రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యత,సోదరభావం,ఆత్మీయతను చాటిచెప్పే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గజ్వేల్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు గజ్వేల్ నియోజకవర్గ ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కమిటీ సభ్యులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ అలయ్ బలయ్ కమిటీ సభ్యులు పొన్నాల కుమార్,నీరుడి స్వామి,బాకీ స్వామి ముదిరాజ్,సంఘపు కన్న యాదవ్,కొడకండ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మృత్యుఘోష!..

గ్యాస్ లీకేజీ కలకలం..

- సిగాచి ఘటన మరువకముందే సరాక పరిశ్రమలో మరో ప్రమాదం..
- గ్యాస్ లీకేజీతో ఇద్దరు కార్మికుల మృతి..
- మృతుల కుటుంబాలకు రూ.70 లక్షల చొప్పున పరిహారం..
- పారిశ్రామిక భద్రతపై ప్రశ్నలు.. సమగ్ర విచారణకు జీఎంఆర్ డిమాండ్..



పటాన్‌చేరు, అక్టోబర్ 23 (ప్రజా కలం) ప్రతినిధి

పారిశ్రామిక ప్రమాదాలు కార్మికుల ప్రాణాలను బలిగొంటున్నా భద్రతా చర్యలు ఎక్కడున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సిగాచి పరిశ్రమ ప్రమాదం మరువకముందే గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీతో ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పటాన్‌చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మృతుల కుటుంబాలకు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారంతో పాటు అంత్యక్రియల కోసం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు..

ఘటనాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే..

సమాచారం అందిన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్న గూడెం మహిపాల్ రెడ్డి పరిస్థితులను పరిశీలించి, యాజమాన్యం, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆదేశించారు.

అనంతరం పటాన్‌చేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మృతుల కుటుంబాలను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

భద్రతా లోపాలపై చర్యలు తీసుకోవాలి..

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలవుతున్నాయా? గ్యాస్ లీకేజీలను అరికట్టే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? అనే అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సరాక పరిశ్రమ ప్రమాదానికి కారణాలను గుర్తించి, భద్రతా లోపాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిగాచి ఘటన నుంచి గుణపాఠాలు నేర్చుకుని పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించడం పరిశ్రమల యాజమాన్యాలు, ప్రభుత్వ అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు..

దేశ రక్షణకు దళాల ఏకీకరణే కీలకం..

- భవిష్యత్ యుద్ధాలకు సమగ్ర సన్నద్ధత అవసరం: నితిన్ ఎ. గోఖలే..
- 2047 లక్ష్యంగా రక్షణ రంగంలో సంస్కరణలు.. సంయుక్త కార్యాచరణకు పిలుపు..



పటాన్‌చెరు, అక్టోబర్ 23 (ప్రజా కలం) ప్రతినిధి

భారతదేశ రక్షణ సామర్థ్యాన్ని పెంచడంలో త్రివిధ దళాధిపతి కీలక పాత్ర పోషిస్తున్నారని భారత్ శక్తి గ్రూప్ వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు నితిన్ ఎ. గోఖలే పేర్కొన్నారు. సైన్యం, నౌకాదళం, వైమానిక దళం మధ్య సమన్వయం పెంచి, భవిష్యత్ యుద్ధాలకు దేశాన్ని సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గీతం విశ్వవిద్యాలయానికి చెందిన కౌటిల్య ప్రజావిధాన పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఆతిథ్య ఉపన్యాసంలో ఆయన ప్రసంగించారు.

భారత రక్షణ వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు,త్రివిధ దళాధిపతి వ్యవస్థ ఏర్పాటు,సైనిక వ్యవహారాల శాఖ పాత్రను వివరించారు.సమీకృత సైనిక కమాండ్ల ఏర్పాటు,స్వదేశీ రక్షణ ఉత్పత్తుల అభివృద్ధి, ఆధునికీకరణ, వనరుల సమర్థ వినియోగం ద్వారా దేశ రక్షణను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.

2047 నాటికి సాయుధ దళాల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు దళాల మధ్య సమన్వయ లోపాలు, పరిపాలనా సవాళ్లను అధిగమించి సంయుక్త కార్యాచరణను బలోపేతం చేయాలని నొక్కిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఉన్నత రక్షణ వ్యవస్థలో నమన్వయం ప్రాధాన్యాన్ని కూడా వివరించారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొని వారి సందేహాలకు సమాధానాలిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌటిల్య ప్రజావిధాన పాఠశాల డీన్, ఐక్యరాజ్య సమితిలో భారత మాజీ శాశ్వత ప్రతినిధి సయ్యద్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు..





భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని దర్శించుకున్న బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 23, (ప్రజా కలం)

ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానాన్ని ఏఐసీసీ – విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని, మనశ్శాంతిని కలిగించిందని ఆయన తెలిపారు.శ్రీ సీతారామచంద్ర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో బీజేపీ జాతీయ నేతలకు స్వాగతం పలికిన బీజేపీ రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం ,అక్టోబర్ 23, (ప్రజా కలం)

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో బీజేపీ వివిధ విభాగాల సేల్స్ జాతీయ కన్వీనర్, మాజీ ఎంపీ వీ.డీ. శర్మ బీజేపీ జాతీయ సేల్స్ జాయింట్ కన్వీనర్ శ్రీ



విష్ణు వర్ధన్ రెడ్డి కి ఘన స్వాగతం లభించింది.బీజేపీ రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వారికి భారీ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు సి.హెచ్. కృష్ణారెడ్డి, బి. ప్రతాప్, గంగాపురం వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, విష్ణు వర్ధన్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తక్కల్ల పల్లి హై స్కూల్ లో సరస్వతి విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

చొప్పదండి : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని తక్కలపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, ప్రముఖ వ్యాపారి కటకం సత్యనారాయణ తను చదువుకున్న తకలపల్లి గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ హైస్కూల్ లో శ్రీ సరస్వతి మాత విగ్రహం నెలకొల్పేందుకు గాను విజయదశమి సందర్భంగా భూమి పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు చదువుల మాత శ్రీ సరస్వతి ఆలయం నిర్మాణ పనులను పూర్తిచేసి వచ్చే వసంత పంచమి రోజు ప్రారంభిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల లత , జెడ్ పి హై స్కూల్ హెడ్మాస్టర్, ప్రముఖ న్యాయవాది ముద్ గంటి జనార్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సత్యం రెడ్డి, హనుమంత రెడ్డి , దండు అశోక్ , పాలకుర్తి లక్ష్మణ్, రంజిత్ పాల్గొన్నారు.

బీసీ సీఎం కానీ ఇంకా సమయం ఉంది

హైదరాబాద్ : తెలంగాణకు బీసీ వర్గానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడానికి ఎలాంటి గడువులు లేవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కాంగ్రెస్ పార్టీ ద్వారానే బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, సంక్షేమ పథకాల అమలు అద్భుతంగా ఉందని మహేశ్ గౌడ్ ప్రశంసించారు. ఈ పనితీరుతో కాంగ్రెస్ ప్రభుత్వం 2034 వరకే కాదని, 2039 వరకు కూడా అధికారంలో ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపేందుకే రేవంత్ రెడ్డి 2034 వరకు తానే సీఎంగా ఉంటానని చెప్పారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. వచ్చే టర్మ్‌లో మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా తమకు ఎలాంటి తొందర లేదని, భవిష్యత్తులో బీసీ నేతకు అవకాశం వస్తుందని పేర్కొన్నారు.బీసీ సీఎం నినాదం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచన అని మహేశ్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎవ్వరు ఏం జరుగుతుందో ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ బీసీని ముఖ్యమంత్రిని చేయగలదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కొందా సురేఖ విషయంలో ఆమె కుమార్తె సుస్మిత తొందరపడి వ్యవహరించారని ఆయన అభిప్రాయపడ్డారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉందని, రాష్ట్రంలో బీజేపీకి భవిష్యత్తు లేదని అన్నారు.


మంచిర్యాలలో మంత్రి వివేక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు వర్గపోరు

అదిలాబాద్ : తెలంగాణలోని మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత వర్గపోరు ముదిరి, తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పండుగ రోజుల్లో చోటుచేసుకున్న వరుస దాడులతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సద్దుల బతుకమ్మ రోజున మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేటలో జరిగిన వివాదం సదుమణగక ముందే, దసరా రోజున మరోసారి 2 వర్గాల మధ్య గొడవలు జరిగాయి. ఈ ఘర్షణలకు సంబంధించి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.మరోవైపు కాంగ్రెస్ నేత జగన్ మోహన్ రావు నివాసంపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు వర్గీయులు దాడికి పాల్పడే అవకాశం ఉందన్న సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్త చర్యగా జగన్ మోహన్ రావు ఇంటి వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. నేతల మధ్య ఉన్న పాత కక్షలు దాడుల వరకు వెళ్లడంతో స్థానికంగా తీవ్ర రాజకీయ ఉత్కంఠ నెలకొంది. మంచిర్యాల నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తోంది.వరిస్థితి చేయిదాటిపోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామంలో పోలీసుల పహారా కొనసాగుతోంది. ముందస్తు చర్యల్లో భాగంగా మంత్రి వివేక్ వర్గానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్ నివాసంలో ఉన్న కుటుంబ సభ్యులతో పాటు, మాలమహానాడు నాయకుడు మాడ దయాకర్‌లను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

హర్షగూడకు 24 గంటల త్రీఫేస్ విద్యుత్ ఇవ్వాలి

మహేశ్వరం ఏఈ చక్రపాణికి వినతి

మంఖల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మేగావత్ రవీందర్ నాయక్



మహేశ్వరం,
అక్టోబర్ 23 (ప్రజా కలం):

మహేశ్వరం మండలం హర్ష గూడ గ్రామానికి 24 గంటల పాటు నిరంతరాయంగా త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ మహేశ్వరం విద్యుత్ శాఖ ఏఈ చక్రపాణికి మంఖల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మేగావత్ రవీందర్ నాయక్,మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ నాయక్ బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నర్సింగ్ రాజ్ మాట్లాడుతూ హర్షగూడ గ్రామంలో సరైన త్రీఫేస్ కరెంటు లేకపోవడం వల్ల గ్రామ ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి హర్షగూడ గ్రామానికి 24 గంటల త్రీఫేస్ విద్యుత్ అందించి ప్రజా సమస్యను పరిష్కరించాలని ఏఈ చక్రపాణిని కోరారు. దీనిపై ఏఈ చక్రపాణి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రవీందర్ నాయక్ తెలిపారు. అలాగే 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ మంజూరు చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నర్సింగ్ రాజ్, తుక్కుగూడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పార్టీ విలాస్, సీనియర్ నాయకులు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ మంజూరుకై ఏఐటీయుసి పోరాటం

- ఈఎస్ఐ డైరెక్టర్ ను కలిసిన ఏఐటీయూసీ ప్రతినిధి బృందం

- రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు

మహేశ్వరం, అక్టోబర్ 23 (ప్రజా కలం)

రంగారెడ్డి లక్షలాది మంది సాఫ్ట్వేర్ ఉద్యోగులు పరిశ్రమ కార్మికులు ఉన్నందున ఈ ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ ఉందా పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నేడు ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షుడు పద్దతి లక్ష్మణ్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజులతో కలిసి ఆయన ఈఎస్ఐ ప్రియరంజన్ సిన్హా డైరెక్టర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ జిల్లాలో షాద్నగర్ నుండి కాటేదాన్ వరకు మహేశ్వరం నుండి చేవెళ్ల వరకు విస్తరించి ఉన్న వేలాది పరిశ్రమలలో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. సాఫ్ట్వేర్ ఉద్యోగులు అంతర్జాతీయ విమానాశ్రయంలో పనిచేసే ఎంప్లాయిస్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో ఉన్న కార్మికులు ఇలా లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్న ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడం వల్ల కార్మికులకు అనారోగ్యం వస్తే ననత్ నగర్ లేదా నాచారం వెళ్లి చికిత్స చేయించుకోవడం కోసం వైద్యం కోసం ఒకరోజు వేతనాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. భాగ్యనగరానికి అతి సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లా దినదిన అభివృద్ధి చెందుతూ ముందుకు పోతున్న ఈ ప్రాంతంలో ఈఎస్ఐ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిని మంజూరు చేసే వరకు కార్మికుల తరఫున ఏఐపియుసి పోరాటం నిర్వహిస్తుందని అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని భవిష్యత్తులో ఈఎస్ఐ హాస్పిటల్ కోసం ఉద్యమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయకం మాట్లాడుతూ ఇదివరకే అనేక దఫాలుగా ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ను ఇతర ఉన్నతాధికారులను కలిసి వేడుకున్న పట్టించుకోకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన చెందారు

కార్మికుల శ్రమశక్తితో ఉత్పత్తి ద్వారా ప్రభుత్వాలకు లక్షల కోట్ల ఆదాయం వస్తున్నప్పటికీ కార్మికుల మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రిని మంజూరు చేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన చెందారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని మంజూరు చేయకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన అధికారులను హెచ్చరించారు.

పనులకు గడువు పెట్టండి.. వేగం పెంచండి

- రాజన్న ఆలయ విస్తరణ పనులపై కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు.

- 80 అడుగుల రహదారి, బద్ది పోచమ్మ ఆలయ పనులు సకాలంలో పూర్తి చేయాలి.

వేములవాడ, అక్టోబరు 22 (ప్రజా కలం ప్రతినిధి) :

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతోపాటు ప్రతి పనికి స్పష్టమైన గడువు విధించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి...

అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దేవాదాయ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని, అవసరమైన మేర కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

80 అడుగుల రహదారిపై ప్రత్యేక దృష్టి...

రాజన్న ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ వంతెన వరకు చేపడుతున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ టవర్లకు సంబంధించిన పనులను కూడా వేగంగా చేపట్టాలని ఎన్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. గుడి చెరువు బండ్ పార్కులో మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణకు సంబంధించి మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లానాయక్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్‌అండ్‌బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేశ్, తహసీల్దార్ జయంత్, వీటీఏడీఏ, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.



తాటి చెట్టుపై నుండి పడి గీతా కార్మికుడు మృతి

వలిగొండ అక్టోబర్ 23 ప్రజాకలం:తాటి చెట్టు పైనుండి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేనుకుంది. పోలీసులు,గ్రామస్తులు తెలిపిన సమాచారం ప్రకారం.రెడ్లరేపాక గ్రామానికి చెందిన కొండం శంకరయ్య గౌడ్ (65) ప్రతిరోజు తాటి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు.రోజు మాదిరి గానే శుక్రవారం ఉదయం చెట్లు గీయడానికి వెళ్లిన శంకరయ్య ప్రమాదవశాత్తు కాలుజారి తాటి చెట్టు పైనుండి ఒక్కసారిగా కిందపడ్డాడు.దీంతో అతని తలకు తీవ్ర గాయాలు కావడతో అక్కడికక్కడే మృతి చెందాడు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.



మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు



ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన సవతి తండ్రి సయ్యద్ గౌస్ (65)కు కోర్టు జీవిత ఖైదు విధించింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయమూర్తి కె. వెంకటేష్ ఈ తీర్పు వెల్లడించారు. నిందితుడికి పలు సెక్షన్ల కింద శిక్షలు, జరిమానాలు విధించడంతో పాటు బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం మంజూరు చేశారు. జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేయగా, డీఎన్ఏ నివేదిక కీలక సాక్ష్యంగా నిలిచింది.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



మహేశ్వరం అక్టోబర్ 23 (ప్రజా కలం)

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేసి, కాసేపు పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.


ప్రపంచంలోనే తొలిసారి..

-డ్రోన్‌తో గాయపడిన సైనికుడిని ఎయిర్‌లిఫ్ట్ చేసిన ఉక్రెయిన్

రష్యా : రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న పోరాటం రోజురోజుకూ నూతన సాంకేతిక పరిజ్ఞానానికి ప్రధాన వేదికగా మారుతోంది. ఇప్పటివరకు శత్రు దళాల లక్ష్యాలపై దాడులు చేయడానికి, నిఘా పెట్టడానికి మాత్రమే పరిమితమైన డ్రోన్లు.. ఇప్పుడు ప్రాణాలను కాపాడే ఆపద్బాంధవులుగా మారుతున్నాయి. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన ఒక సైనికుడిని ఉక్రెయిన్ బలగాలు భారీ డ్రోన్ సాయంతో సురక్షిత ప్రాంతానికి ఎయిర్‌లిఫ్ట్ చేసినట్లు సమాచారం అందుతోంది. సైనిక చరిత్రలోనే ఇటువంటి అత్యవసర రెస్క్యూ ఆపరేషన్ చేపట్టడం బహుశా ఇదే తొలిసారి కావడంతో ఈ ఘటన అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. రష్యా–ఉక్రెయిన్ సరిహద్దుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గాయపడిన సైనికులను ఆస్పత్రులకు తరలించడం సైన్యానికి అతిపెద్ద సవాలుగా మారింది. యుద్ధ క్షేత్రాల్లో ఎక్కడ చూసినా పేలుడు పదార్థాలు, మందుపాతరలు పరిచి ఉండటంతో రెస్క్యూ వాహనాలు వెళ్లడం అసాధ్యంగా మారింది. మరోవైపు మైదాన ప్రాంతాల్లో స్వల్ప కదలికలు ఉన్నా శత్రువుల డ్రోన్లు సులభంగా పసిగడుతున్నాయి. దీనివల్ల గాయపడిన సైనికులను కాపాడేందుకు వెళ్లే వైద్య బృందాలు , సహాయక సిబ్బంది కూడా దాడులకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పెరిగింది. ఈ క్లిష్టమైన పరిస్థితుల్లో సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఆలోచించిన ఉక్రెయిన్ సైన్యం, భూమార్గాన్ని విడిచిపెట్టి ఆకాశమార్గాన్ని ఎంచుకుంది. సాధారణంగా యుద్ధ రంగం నుంచి గాయపడిన వారిని తరలించేందుకు హెలికాప్టర్లు



లేదా ప్రత్యేక అంబులెన్సులను వాడతారు. అయితే తీవ్రమైన ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల్లో హెలికాప్టర్లను పంపితే శత్రువులు వాటిని క్షిపణులతో కూల్చేసే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ బలగాలు ఒక భారీ పేలోడ్ మోయగల డ్రోన్‌ను రెస్క్యూ కోసం రంగంలోకి దించాయి. గాయపడిన సైనికుడిని సురక్షితంగా డ్రోన్‌కు అనుసంధానించి.. గగనతలం ద్వారా శత్రువుల కంటపడకుండా సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఆ తర్వాత వెంటనే అతడిని సమీప ఆస్పత్రికి చేర్చి అత్యవసర వైద్య చికిత్స అందించారు. అయితే ఈ ఆపరేషన్‌లో ఉపయోగించిన డ్రోన్ మోడల్, ప్రయాణించిన దూరం, ఈ ఘటన జరిగిన ఖచ్చితమైన ప్రదేశం వంటి వివరాలను సైన్యం గోప్యంగా ఉంచింది. ఈ వినూత్న ప్రయోగం ఆధునిక యుద్ధ తంత్రంలో రాబోయే పెద్ద మార్పులకు సంకేతంగా నిలుస్తోంది. దీనివల్ల రెస్క్యూ సిబ్బంది నేరుగా ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే బాధితులను కాపాడవచ్చు. అలాగే 'గోల్డెన్ అవర్' అని పిలిచే క్లిష్ట సమయంలో సైనికుడికి అత్యంత వేగంగా వైద్యం అందే అవకాశం లభిస్తుంది. భవిష్యత్తులో ప్రాణరక్షణతో పాటు అత్యవసర మందులు, రక్తం, ఇతర వైద్య పరికరాలను వేగంగా యుద్ధ క్షేత్రానికి చేరవేయడంలో కూడా ఈ సాంకేతికత కీలక పాత్ర పోషించనుంది. ఐతే ఈ సాంకేతికత మరింత విస్తరించాలంటే భారీ మానవ బరువును మోసే సామర్థ్యం, బ్యాటరీ రన్‌టైమ్, ప్రతికూల వాతావరణ పరిస్థితులు... శత్రువుల జామింగ్ సాంకేతికతల నుంచి ఈ డ్రోన్లను రక్షించుకోవడం వంటి ప్రధాన సవాళ్లను అధిగమించాల్సి ఉంటుంది. ప్రత్యర్థి దళాలపై బాంబుల వర్షం



బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 23:

ఐదేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ నిజామాబాద్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి దుర్గాప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసుల కథనం ప్రకారం... 2021 సెప్టెంబర్‌లో నిజామాబాద్ నగరంలోని ఒక ప్రాంతంలో ఐదేళ్ల బాలికపై మాచా రవీంద్రనాథ్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైం నంబర్ 236/2021గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై మోపబడిన ఆరోపణలు న్యాయస్థానంలో రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు.

భారతీయ శిక్షాస్మృతి (IPC) సెక్షన్ 354-ణ కింద నిందితుడికి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా, అలాగే పోక్సో (POCSO) చట్టంలోని సెక్షన్ 9 కింద 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

పోలీసు సిబ్బందికి అభినందనలు

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా పక్కా ఆధారాలతో, సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యమిస్తుందని, వారిపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

శబరిమలై కి పాదయాత్ర గా బయలుదేరిన యాకరి యాదగిరి గురుస్వామి

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 23 ప్రజా కలం

జూలూరు గ్రామంలో యాకరి యాదగిరి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు శబరిమలై పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. యాదాద్రి



భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన యాకరి యాదగిరి గురుస్వామి గత 22 సంవత్సరాల నుండి అయ్యప్ప మాల వేస్తూ,గత 4 సంవత్సరాలు గా శబరిమలైకు పాదయాత్ర గా శుక్రవారం బయలుదేరారు. అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యాకరి రేణుక నర్సింగ్ రావు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు యాకరి శివ,బొచ్చు స్వామి,యాకరి మని, బొచ్చు భాను, కామాటి భాను, భైరవ నవీన్,అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి: సీపీ సాయి చైతన్య



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబరు 23:

నిజామాబాద్ వేదికగా వచ్చే నెల (నవంబర్ - 2026)లో నిర్వహించనున్న 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు వేడుకల ఏర్పాట్లపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ సమీక్షించారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏసీపీలు, క్రీడా విభాగాల అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పోలీస్ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

సమీక్షలోని ముఖ్యాంశాలు:

సౌకర్యాల కల్పన: క్రీడాకారులకు నాణ్యమైన వసతి, భోజనం, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి.

మైదానాల సిద్ధీకరణ: పోటీలకు అవసరమైన అథ్లెటిక్స్ ట్రాక్‌లను, క్రీడా మైదానాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలి.

వైద్య సేవలు: క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా మైదానాల వద్ద ప్రత్యేక వైద్య సిబ్బందిని, ప్రథమ చికిత్స కేంద్రాలను (ఫస్ట్ ఎయిడ్) ఏర్పాటు చేయాలి.

సమన్వయం: విభాగాల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి, ఈ క్రీడా పండుగను విజయవంతం చేయాలని సీపీ స్పష్టం చేశారు.

ఇక్కడ పోటీల నిర్వహణ..

ఈ ఐదో విడత పోలీస్ క్రీడలను జన్కంపేట్‌లోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్, అలీ సాగర్, నాగారం గ్రౌండ్, కాలూరు రోడ్డు, ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్, మరియు ముగుపల్ ఆర్చరీ అకాడమీ తదితర ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, శ్రీ కృష్ణ, నరేందర్, గురు నాయుడు, మస్తాన్ అలీ, డివైఎస్ఓ బి. పవన్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరాజ్, వివిధ క్రీడల కోచ్‌లు రవీందర్, మహిపాల్ రెడ్డి, రాజా గౌడ్, విజయ్ కాంత్ రావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

బ్రాహ్మణపల్లి చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం



బీబీనగర్, అక్టోబర్ 23 (ప్రజాకలం): కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హుల పేర్లను తిరిగి చేర్చాలని కోరారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి రోడ్డు చౌరస్తాలో జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషనర్ నియామక చట్టంలో మార్పులు చేసి, తనకు అనుకూలమైన వ్యక్తిని నియమించుకుందని ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన వారి ఓటు హక్కును తొలగించడం సరికాదన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని, అర్హులందరికీ ఆ హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన ఓటర్లు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఓటర్ల జాబితాలో నుంచి తొలగించిన అర్హుల పేర్లను తిరిగి చేర్చాలని, 2023లో తీసుకొచ్చిన ఎన్నికల కమిషన్ నియామక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కును అణచివేయడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బండారు శ్రావణ్‌కుమార్, రైతు సంఘం మండల నాయకుడు బండారు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాసు, ఓవాల్దాస్ సతీష్, పంజాల జంగయ్య, ఓవల్దాస్ హరికృష్ణ, దండెబోయిన శ్రీశైలం, చేట్టబోయిన కనకయ్య, కుంట యాదగిరిరెడ్డి, పాశం బాలయ్య, పొట్ట యాదగిరి, పెరుమాళ్ల స్వామి, పొట్ట రమేష్, పొన్నాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 25, 26 తేదీల్లో చలో హైదరాబాద్

మహాధర్నాను జయప్రదం చేయండి

కార్మికుల కనీస వేతనం 26,000 నుంచి 42,000కు పెంచాలి-- సీఐటీయూ

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) అక్టోబర్ 25, 26 తేదీల్లో నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాను కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశం పిలుపునిచ్చింది.

ఈసందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి పిచ్చన్న మాట్లాడుతూ.... కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ మహాధర్నాలో పారిశ్రామిక కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు, తోపుడుబండ్ల కార్మికులు, వారపు మార్కెట్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కార్మికుల వేతనాలు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. అనేక పరిశ్రమల్లో కనీస వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలంటే కనీస వేతనాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

ప్రధాన డిమాండ్లు

కార్మికులకు కనీస వేతనం నెలకు ?26,000 చెల్లించాలి.

పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని నెలకు ?42,000కు పెంచాలి.

జీఓ నెం. 6 ప్రకారం వేతనాలు చెల్లించి, వర్తించే వేతన పెంపులు, బకాయిలను అందించాలి.

కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి.

ఓవర్‌టైమ్‌కు రెట్టింపు వేతనం చెల్లించాలి.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల దోపిడీని అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలి. బోనస్, సెలవులు, వారాంతపు సెలవులు తదితర చట్టబద్ధ హక్కులను అమలు చేయాలి.

మహిళా కార్మికులకు సమాన వేతనం, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలి.

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు, పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలి.



60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు ?9,000 పెన్షన్ అందించాలి. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన కార్మికుల సేవలను క్రమబద్ధీకరించాలి

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి.

ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి. తోపుడుబండ్ల, వీధి వ్యాపారుల హక్కులను పరిరక్షించి, వీధి వ్యాపారుల చట్టం--2014ను సమర్థంగా అమలు చేయాలి. వారపు మార్కెట్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, ఎలాంటి వేధింపులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకునే హక్కు కల్పించాలి. కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని, ప్రభుత్వాలు, యాజమాన్యాలపై సంఘటిత పోరాటం ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్మికులందరూ కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు వచ్చి, తమ కుటుంబాల భవిష్యత్తు, ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చలో హైదరాబాద్ మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు నాగభూషణ్, మండల నాయకులు నరసింహ, లింగమ్మ, ఎల్లమ్మ, మాధవులు, మద్దిలేటి, రాజేందర్, మణి, నాగలక్ష్మి, శీను, బాలమణి, ఈషాబేగం, ఏడుకొండలు, వెంకన్న తదితర మండల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేద విద్యార్థిని చదువుకు చేయూత..

దాతృత్వం చాటుకున్న గోలి ప్రణీత పింగల్‌రెడ్డి

ఎంబీబీఎస్ ఫీజు కోసం రూ.50 వేల ఆర్థిక సాయం

బీబీనగర్, అక్టోబర్ 23 (ప్రజాకలం): పేదరికంతో చదువు ఆగిపోకూడదని భావించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి దంపతులు ఓ విద్యార్థినికి రూ.50 వేల సాయం అందించారు. మండలంలోని జైనపల్లి గ్రామానికి చెందిన సోము నిఖిత వైద్య విద్యకు అండగా నిలిచారు. నిఖిత బీబీనగర్‌లోని సాయి సంతోషి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 10 జీపీఏ సాధించింది. ఇంటర్‌లో 1000 మార్కులకు 989 మార్కులు తెచ్చుకుంది. నీట్‌లో మంచి ర్యాంకు సాధించి పటాన్‌చెరువులోని మహేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక కళాశాల ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని సాయి సంతోషి పాఠశాల కరస్పాండెంట్ ఈసారపు అచ్చయ్యగౌడ్ గోలి ప్రణీత పింగల్‌రెడ్డి దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన వారు నిఖిత చదువు కోసం రూ.50 వేలు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా గోలి ప్రణీత పింగల్‌రెడ్డి దంపతులు మాట్లాడుతూ.. డబ్బులు లేవనే కారణంతో విద్యార్థులు చదువుకు దూరం కావద్దని అన్నారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలనుకునే విద్యార్థులకు తమ వంతు సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అక్బర్, పింగల్ అన్న సేవాదళ్ అధ్యక్షుడు ఎండీ మోయిన్, ఎలుగుల నరేందర్, కాసుల అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మృతిలో.. 26న రక్తదాన శిబిరం

రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి - సీఐ సూర్య నాయక్

బీబీనగర్, అక్టోబర్ 23 (ప్రజాకలం): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా డీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బీబీనగర్ సీఐ సూర్య నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీబీనగర్ మండల ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రక్తదానం చేయడానికి ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శిబిరంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 87126 62737 నంబరును సంప్రదించాలని సూచించారు.





ఆగిపోయిన ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించాలి: అపురూప కాలనీ వాసులు

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఎస్సార్ నాయక్ నగర్ లో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం తెరిపించాలని సీనియర్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకటశేషాచారి ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి తెరిపించేటట్టు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత కొన్ని నెలలుగా ఎస్సార్ నాయక్ నగర్ లో ఇండోర్ స్టేడియం మూత వేశారు. ఇండోర్ స్టేడియం వెంటనే తెరిపించేటట్టు చర్యలు తీసుకోవాలని గుబ్బల లక్ష్మీనారాయణ ఆలూరు వెంకటశేష చారిలు విజ్ఞప్తి చేశారు. స్టేడియం ఆగిపోవడం వల్ల ఆప్రాంతంలో అసాంఘిక శక్తులు గంజాయి బ్యాచ్ అక్కడ చేరుకుని ఆవాతావరణాన్ని చెడగొట్టేటట్టు ఉన్నాయని తమ చేతుల మీదుగా ప్రారంభమైన ఈ స్టేడియం తొందరగా ప్రారంభమయ్యేటట్టు కృషి చేయాలని కోరారు. ఎస్సార్ నాయక్ నగర్ అపురూప కాలనీ, జనప్రియ అపార్ట్మెంట్స్ మోడీ బిల్డర్స్ వారికి ఉపయోగపడుతుందన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన

బీబీనగర్,అక్టోబరు 23 (ప్రజాకలం): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బీబీనగర్ పోలీసులు మండల విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు బీబీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న సుమారు 87 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సైబర్ నేరాల నివారణలో పోలీసులు, ప్రజల పాత్ర.. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాల్సిన అవసరంపై పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వ్యాసాలను సమర్పించారు. చిన్న వయసు నుంచే సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. బీబీనగర్ సీఐ సూర్య నాయక్, ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది కార్యక్రమాన్ని నిర్వహించారు.



పేదింటి బిడ్డలకూ కార్పొరేట్ చదువులు

-- సర్కారు బడుల్లో డిజిటల్ విద్యకు శ్రీకారం..
మల్లారంలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన ప్రభుత్వ విప్.



వేములవాడ రూరల్, అక్టోబర్ 23 (ప్రజా కలం ప్రతినిధి) ,:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ, నాణ్యమైన విద్యతోపాటు పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 'సేవా సంకల్ప అభియాన్--డిజిటల్ ఎడ్యుకేషన్ అండ్ ఏఐ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆది శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఏఐ) నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కంప్యూటర్ విద్యతో విద్యార్థులకు భవిష్యత్తులో విస్తృత అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నూతన సిలబస్, మెరుగైన విద్యా ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచి వారి ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. విద్యతోపాటు నాణ్యమైన పోషకాహారం అందించడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతోందన్నారు.

కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో రాష్ట్రంలోనూ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గానికి కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తీసుకొచ్చామని, అక్కడ సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యనందించే అవకాశం కల్పించామని వివరించారు.ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించినప్పుడు తల్లిదండ్రులు వెల్లడించిన అనుభవాలను ఆయన ప్రస్తావించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు ఏడాదికి రూ. 60 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో ఆర్థిక భారం తగ్గుతోందని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆరుట్ల పాఠశాలలో 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు పూర్తయి, అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి రావడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం...

విద్యతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ముచ్చర్ల ప్రాంతంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆధునిక ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు.మల్లారం గ్రామ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

మహేశ్వరంలో రూ.60 కోట్ల భారీ భూ కుంభకోణం

- పేరేడు 1 నుంచి 6 వరకు భూములపై విచారణకు డిమాండ్
- గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు గా ఉన్నవారే కబ్జా చేశారా...?
-కబ్జా జరిగిన భూమి తిరిగి స్వాధీనం చేసుకునే వరకు పోరాటం ఆగదు
- మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్



మహేశ్వరం, అక్టోబర్ 23, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కేంద్రంలోని పేరేడు 1 నుంచి 6 వరకు ఉన్న గ్రామకంఠం భూముల వివరాలు, లేఅవుట్ అనుమతులు, భూముల విస్తీర్ణంపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ.60 కోట్ల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పేరేడు భూముల వివరాలివే

కాకిశ్వర్ ముదిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పేరేడు 1లో 2.11 గుంటలు, పేరేడు 2లో 1.35 గుంటలు, పేరేడు 3లో 0.11 గుంటలు, పేరేడు 4లో 0.35 గుంటలు, పేరేడు 5లో 0.27 గుంటలు, పేరేడు 6లో 0.06 గుంటల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన ఈ వివరాల ప్రకారం మొత్తం భూమి 9.05 గుంటలు కలదు.

లేఅవుట్ అనుమతులపై సందేహాలు

పేరేడు 1, 2 ప్రాంతాల్లో సుమారు 72 ప్లాట్లతో లేఅవుట్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కాకిశ్వర్ తెలిపారు. ఈ లేఅవుట్‌కు సంబంధించి సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా? భూమి విస్తీర్ణం ఎంత, ఇప్పటివరకు హ లేఅవుట్ లో ఎన్ని విక్రయాలు జరిగాయి? అనే అంశాలపై విచారణ చేపట్టాలని కోరారు. గ్రామకంఠం భూములుగా పేర్కొంటున్న స్థలాల వాస్తవ పరిస్థితిని సర్వే చేసి, రికార్డులతో సరిపోల్చాలని అన్నారు.

ఆర్టీఐ ద్వారా వివరాల సేకరణ

లే అవుట్ భూములకు సంబంధించిన ఇంకా కొన్ని డాకుమెంట్స్ కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు కాకిశ్వర్ వెల్లడించారు. ఈ నెల 18న స్థానిక సర్పంచ్ మునగపాటి నవీన్ కూడా ఇదే అంశంపై దరఖాస్తు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికా రులు పత్రాలు, అనుమతులు, భూముల వర్గీకరణ వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడిం చాలని కోరారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

పేరేడు 1, 2లోని భూముల్లో కొంత భాగాన్ని బస్టాండ్‌కు, మరికొంత భాగాన్ని శివాలయానికి కేటాయించాలనే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కాకిశ్వర్ తెలిపా రు. పేరేడు 3 నుంచి 6 వరకు ఉన్న భూముల వివరాలను కూడా పరిశీలించాలని కోరారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన కొందరు పేరేడు 1 నుండి 6వరకు ఉన్న 9.05 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి లే అవుట్ గా మార్చి ప్లాట్లు అమ్మకాలు, కొనుగోలు చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ అంశాలపై రిజిస్ట్రేషన్ పత్రాలు, లేఅవుట్ అనుమతులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. ప్రభుత్వ భూముల విషయం పై వాస్తవాలను ప్రజలకు వివరిస్తే తనపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాకిశ్వర్ పేర్కొన్నారు. తాను గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, తనపై వచ్చిన ఆరోపణలైనా, తాను చేస్తున్న ఆరోపణలైనా ఆధారాలతోనే తేలాలని అన్నారు. పేరేడు 1 నుంచి 6 వరకు ఉన్న భూములపై సమగ్ర విచార ణ జరిపి, ఎలాంటి అక్రమ లావాదేవీలు జరగకుండా చూడాలని తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ అధికారులను కోరారు. త్వరలోనే తన వద్ద ఉ న్న ఆధారాలతో జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులను కలిసి ఈ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని కాకిశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారిగళ్ల లాజార్, గద్దగూటి జంగయ్య ముదిరాజ్, కాకి మల్లేష్ ముదిరాజ్, అల్లే రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

దబిల్‌గూడ వేదికగా రాష్ట్రవ్యాప్త ఆర్థిక సమ్మిళిత పథకాల ప్రచారం ప్రారంభం

- ముఖ్య అతిథిగా ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్
- అతిథిగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది



మహేశ్వరం ,అక్టోబర్ 23, (ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్రవ్యాప్త ఆర్థిక సమ్మిళిత పథకాల సంతృప్తీకరణ ప్రచారాన్ని శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దబిల్‌గూడ గ్రామ పంచాయతీలో లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) నిర్దేశించిన అక్టోబర్ 21 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించే ప్రచారంలో భాగంగా తెలంగాణ ఎస్ఎల్‌బీసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి లీడ్ బ్యాంక్ కార్యాలయం, ఎస్‌బీఐ అమీర్‌పేట శాఖ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్, గౌరవ అతిథిగా ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది హాజరయ్యారు.ఎస్‌బీఐ జనరల్ మేనేజర్, తెలంగాణ ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ శ్రీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రచార లక్ష్యాలను, గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో నిర్వహించే శిబిరాల ద్వారా అందించే బ్యాంకింగ్ సేవలను వివరించారు.ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ జ్ఞాన సుప్రభాత్ ఎం. మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన ప్రయోజనాలను వివరించారు.

ఖాతాదారులు రీ-కేవైసీ పూర్తి చేసుకోవాలని, తమ ఖాతాల్లో నామినేషన్ వివరాలను నవోదు చేసుకోవడంతోపాటు అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం తరఫున హాజరైన రంగారెడ్డి డీఆర్‌డీఓ ఎల్. శ్రీలత మాట్లాడుతూ ప్రచారం విజయవంతానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని తెలిపారు.నాబార్డు హైదరాబాద్ డీజీఎం ఎంవీఎన్ఎన్ శ్రీనివాస్ కూడా ప్రసంగించారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సీజీఎం ఎస్. గోపాల్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం బైజ్‌నాథ్ సింగ్, టీజీబీ జీఎం కృష్ణశర్మ, ఎన్‌బీఐ సికింద్రాబాద్ పరిపాలనా కార్యాలయ డిప్యూటీ జనరల్ మేనేజర్ మదన్ స్వామినాథన్, వికారాబాద్ ఆర్‌బీఓ రీజినల్ మేనేజర్ మోహన్ నాయక్ ధనావత్, సర్పంచ్ యాదమ్మ, ఉప సర్పంచ్ అర్చన పాల్గొన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల రాష్ట్ర స్థాయి నియంత్రణాధికారులు కూడా హాజరయ్యారు. సుమారు 500 మంది పాల్గొన్న ఈ శిబిరంలో ఆర్థిక సమ్మిళిత పథకాలు, రీ-కేవైసీ, నామినేషన్లు, క్లెయిమ్ చేయని డిపాజిట్లకు సంబంధించిన సేవల కోసం బ్యాంకులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు.



బ్యాంకు రుణాలతో బిజినెస్ బూస్ట్!

- వస్త్ర పరిశ్రమ వృద్ధికి రుణాలే ఊతం..
కలెక్టర్ గరిమ అగర్వాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 23 (ప్రజా కలం ప్రతినిధి) :

బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణాలు పొంది, వాటిని వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులకు పిలుపునిచ్చారు. ఆర్థికంగా ఎదుగుతూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ఎంఎస్ఎంఈ సంవాద్' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చేనేత, పవర్‌లూమ్ రంగాలకు చెందిన వారికి సంస్థాగత రుణాలు, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన, ఆకర్షణీయమైన వస్త్రాలను తయారు చేయాలని సూచించారు. ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా మెరుగైన మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. తద్వారా యూనిట్ యజమానులు, కార్మికులకు అధిక ఆదాయం లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆర్డర్లకే పరిమితం కాకుండా ప్రైవేటు సంస్థల ఆర్డర్లను సైతం పొందే స్థాయికి ఎదగాలని సూచించారు. మార్కెట్ పోటీని తట్టుకునేలా ఉత్పత్తుల నాణ్యతను పెంచుకోవాలని, చేనేత వస్త్రాల తయారీపై ప్రత్యేక దృష్టి సారించి సిరిసిల్ల ఖ్యాతిని మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఆర్‌బీఐ ఎల్‌డీఓ చేతన్ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, వాటి ప్రాధాన్యం, రుణాల సక్రమ వినియోగం, ఆర్థిక క్రమశిక్షణపై వివరించారు. వివిధ మార్గాల్లో రుణాలు తీసుకోవడం వల్ల వీవర్లు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ప్రస్తావించారు. అధిక భారాన్ని కలిగించే అనధికారిక రుణాలపై ఆధారపడకుండా బ్యాంకులను సంప్రదించి, తమ అవసరాలకు తగిన రుణాలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం దిలీప్ చంద్ర, ఎల్‌డీఎం రాజీవ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఏడీ సంతోష్‌కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్‌లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం ప్రిన్సిపాల్ కు
రూ.25 వేల జరిమానా

సమాచార హక్కు కమిషన్ ఆగ్రహం జీతం నుండి కోతకు ఆదేశం

మహేశ్వరం, అక్టోబర్ 23 (ప్రజా కలం):

మహేశ్వరం మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈ గోపి విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.విధుల్లో అలసత్వం, పారదర్శకత లేకపోవడం, జవాబుదారీతనం లేకుండా వ్యవహరించినందుకు గాను ప్రిన్సిపాల్ ఇ. గోపికి రూ.25 వేల జరిమానా విధిస్తూ కమిషన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ జరిమానా మొత్తాన్ని 5 నెలల పాటు నెలకు రూ.5 వేల చొప్పున జీతం నుండి కోత విధించి, సంబంధిత వివరాలను రాష్ట్ర సమాచార హక్కు కార్యాలయానికి పంపాలని కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తెలంగాణ గారికి ఆదేశాలు జారీ చేసింది.

అసలు ఏం జరిగిందంటే..

గతంలో ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించి పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన బి. ధనుంజయ్ గారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా ప్రస్తుత ప్రిన్సిపాల్ వ్యవహరించారన్నది ఆరోపణ.ఒక ఉపాధ్యాయుడితో కలిసి పేరెంట్స్ పేరు మీద నకిలీ లెటర్ రాయించి, దానికి సంబంధం లేని అధికారిక సమాచారాన్ని, స్కూల్ ఫైల్ లో ఉన్న పత్రాలను మొబైల్ ఫోన్ తో ఫోటోలు తీసి ఒక రాజకీయ పార్టీ నేతకు చేరవేసి ప్రెస్ మీట్ పెట్టించారని, వివిధ పత్రికల్లో తప్పుడు వార్తలు, ఒక యూట్యూబ్ ఛానల్ లో తప్పుడు కథనం వచ్చేలా చేసి ధనుంజయ్ గారిని మానసికంగా ఇబ్బందులకు గురి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయంలో తనకు చేరవేసిన లెటర్లకు సంబంధించిన పత్రాలను ఇవ్వాలని గత ఏడాది సెప్టెంబర్ లో సమాచార హక్కు చట్టం-2005 ద్వారా ధనుంజయ్ దరఖాస్తు చేశారు.కేసు పూర్వాపరాలను పరిశీలించిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్, అడిగిన సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ ఇ. గోపికి పలుమార్లు అవకాశం ఇచ్చింది. అయినా సమాచారం ఇవ్వకుండా, కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేయడంతో నిబంధనల ప్రకారం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రూ.25 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కమిషన్ హెచ్చరించింది.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com